www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత: UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 149 | 24-11-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

బొగ్గు గనుల్లో కార్మికుల చెమట

జూలై 1, 2026 నుంచి అమల్లోకి రావాల్సిన కొత్త వేతన ఒప్పందం నవంబర్ వచ్చినా కమిటీ ఏర్పాటు దశ దాటకపోవడంతో సింగరేణి కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వేజ్ బోర్డు చర్చలు పూర్తయ్యే వరకు 40 శాతం మధ్యంతర ఉపశమనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్న కార్మిక వర్గం.. అధికారుల వేతన సవరణకు మార్గం సుగమమై, తమ వంతు ఎప్పడంటూ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తోంది.



- వేతనాల పెంపులో మాత్రం జాప్యం!
- 12వ వేజ్ బోర్డు ఎక్కడ?.. కార్మికుల నిరీక్షణకు ముగింపెప్పడు?
- జూలై 1 నుంచి అమలు కావాల్సిన కొత్త వేతన ఒప్పందంపై అనిశ్చితి

5

- 40 శాతం మధ్యంతర ఉపశమనం కోసం కార్మిక సంఘాల డిమాండ్

ఆసియాలో మూడో మహాశక్తిగా భారత్!



- రెండో అత్యంత సమర్థ నేతగా ప్రధాని మోదీ!

ఆసియా పవర్ ఇండెక్స్-2025లో 'ప్రధాన శక్తి' హోదాకు భారత్ చేరుకుందని ఆస్ట్రేలియా సంస్థ లోవీ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఆసియాలోనే మూడో శక్తిమంతమైన దేశంగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్లు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ రెండో అతి శక్తిమంతమైన నేతగా రికార్డు సృష్టించారు.

4



పెట్టుబడులకు వేదికగా ఫ్యూచర్ సిటీ!

- 80 వేల చదరపు మీటర్లలో అతిపెద్ద బహుళ రంగ ప్రదర్శన
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- వెయ్యికి పైగా కంపెనీలు.. మూడు వేల మంది పారిశ్రామిక ప్రతినిధుల రాకకు ఏర్పాట్లు
- రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, ట్రైబల్ సమ్మిట్, విద్యా ప్రదర్శనలు
- ముఖ గుర్తింపు సాంకేతికతతో ప్రవేశం.. భద్రతపై ప్రత్యేక దృష్టి
- సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష



2

కేసీఆర్ సంతకాలతో జల హక్కులకు సమాధి!

కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి తీరని ద్రోహం

తెలంగాణకు 299 టీఎంసీలు చాలని కేసీఆర్, హరీశ్‌రావు అంగీకారం

- ఏపీకి 512 టీఎంసీలు కేటాయించేందుకు సంతకాలు చేశారు
- పోతిరెడ్డిపాడు విస్తరణకు అప్పటి బీఆర్ఎస్ మంత్రుల ఆమోదం
- పల్నాడు వాటర్ గ్రిడ్‌పై బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తోంది
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం
- ఏపీ ప్రాజెక్టులను చట్టబద్ధంగా అడ్డుకుంటామని స్పష్టీకరణ

హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): తెలంగాణ జల హక్కులకు సమాధి కట్టింది మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావేనని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన కొద్దిరోజులకే కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అంగీకరిస్తూ సంతకాలు చేసి రాష్ట్ర నీటి హక్కులపై మరణశాసనం రాశారని మండిపడ్డారు. కృష్ణా జలాలను కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కృష్ణా జలాల పంపకాలు, పోతిరెడ్డిపాడు, రాయల సీమ ఎత్తిపోతల పథకం, పల్నాడు వాటర్ గ్రిడ్ అంశాలపై మాట్లాడారు.

2

మిగతా 2 లో

రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

'జ్వాలా ఎంకే-1' కౌంటర్ డ్రోన్ మిసైల్ పరీక్ష విజయవంతం!



4

ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



- డిప్యూటీ సీఎం భట్టి
- ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు
- బీఆర్ఎస్ పాలనలో రూ.8.20 లక్షల కోట్ల అప్పులు

2

ఓట్లు మావే.. చోరీ ఆరోపణలు మీవే!



- రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు ధ్వజం
- ఓటర్ల జాబితా సవరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్న
- మృతులు, వలస వెళ్లినవారి పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ తీరును తప్పబట్టిన వైనం
- రాహుల్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఏటీఎంలా మారారని ఆరోపణ

3

ఏం చేశారని కాంగ్రెస్‌కు 90 సీట్లు వస్తాయి?

సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సూటి ప్రశ్న

3

అనర్హుల రేషన్ కార్డులకు కేంద్రం చెక్!

దేశవ్యాప్తంగా రేషన్ కార్డుల ఏరివేతకు రంగం సిద్ధం

ఉచిత రేషన్ లబ్ధిదారుల్లో 13.2 శాతం అనర్హులున్నట్లు అధ్యయనం

కారు, ఏసీ, ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నవారికీ ఉచిత బియ్యం!



ఆదాయం లేకపోవడం మాత్రమే పేదరికం కాదు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 4



నిమ్స్‌లో భారీ అవకతవకలు

- ఏసీబీ తనిఖీల్లో వెల్లడి
- రూ.5 కోట్ల విలువైన ఇంప్లాంట్ల అక్రమ నిల్వలు
- రోగుల డిశ్చార్జి తర్వాత ఆరోగ్యశ్రీ బిల్లులు
- ఒకే రోగికి వారంలో 800 గ్లౌజుల వినియోగం
- టెండర్లు, క్యాంటీన్ నిర్వహణలోనూ అక్రమాలు
- రికార్డులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ

వివరాలు 2వ పేజీలో

తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజులు వానలు

- బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో మారిన వాతావరణం
- ఏపీలో మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం

2





మావోయిస్టుల పునరావాసం

2

రూ.5.59 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



కాంగ్రెస్‌లో తగాదాల్లేవు.. ప్రజా వ్యతిరేకతా లేదు!

- కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జితో భేటీ అనంతరం మంత్రి పొంగులేటి స్పష్టీకరణ
- బీఎం సందీప్‌తో మర్యాదపూర్వకంగానే సమావేశమయ్యానని వెల్లడి

3

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజులు వర్షాలు

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో మారిన వాతావరణం

ఏపీలో 3రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

తెలంగాణలో 24, 25 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం

అమరావతి/హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో రాగల మూడు రోజులపాటు, తెలంగాణలో రెండు రోజులపాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయని తెలిపింది. ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అమరావతి వాతావరణ కేంద్రం వివరాల ప్రకారం నైరుతి బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో తూర్పు గాలుల ద్రోణి విస్తరించి ఉంది. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాల్లో దిగువ వాతావరణ పొరల్లో ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. సోమవారం కోస్తాంధ్ర, యానాంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మంగళ, బుధవారాల్లోనూ కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కొనసాగవచ్చని అంచనా వేశారు. ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, కొన్నిచోట్ల గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగాన్ని చేరుకోవచ్చని తెలిపారు. ఉదయం సమయంలో పొగమంచు ప్రభావం కూడా ఉండవచ్చని పేర్కొన్నారు. రాయలసీమలోనూ సోమవారం నుంచి మూడు రోజులపాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గరిష్ట వేగం 50 కిలోమీటర్ల వరకు చేరుకోవచ్చని హెచ్చరించింది. ఇక తెలంగాణలో సోమవారం ప్రధానంగా పొడి వాతావరణం కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నవంబర్ 24, 25 తేదీల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అయితే భారీ వర్షాలకు సంబంధించి ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదని స్పష్టం చేసింది. నవంబర్ 26 నుంచి 29 వరకు రాష్ట్రంలో తిరిగి పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని అంచనా వేసింది.

మావోయిస్టుల పునరావాసం

రూ.5.59 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

లొంగిపోయిన 214 మంది మావోయిస్టులకు లబ్ధి

హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): తెలంగాణలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోంది. తమ పునరావాస విధానంలో భాగంగా లొంగిపోయిన 214 మంది మాజీ మావోయిస్టులకు నేడు రూ.5.59 కోట్ల నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయుధాలు విడిచిపెట్టి వచ్చిన వారికి పునరావాసం కల్పించి, వారిని తిరిగి సమాజంలో భాగం చేసే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2025 అక్టోబర్ 21న సాయుధ పోరాటాన్ని విడనాడి, జనజీవన స్రవంతిలో కలవాలని ఇచ్చిన పిలుపుతో లొంగుబాట్లు ఊపందుకున్నాయని ఆయన వివరించారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 824 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు 59 మంది ఉండగా, ఛత్తీస్‌గఢ్ నుంచి 754 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది, మహారాష్ట్ర, ఒడిశాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. లొంగిపోయిన వారిలో సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ సభ్యులతో పాటు డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు, పార్టీ సభ్యులు, మిలీషియా సిబ్బంది కూడా ఉన్నారు. తాజా చెల్లింపులతో కలిపి ఇప్పటివరకు మొత్తం 659 మంది లబ్ధిదారులకు రూ.17.68 కోట్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 96 మంది అర్హులు తమ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించిన వెంటనే వారికి కూడా మంజూరైన ప్రోత్సాహకాలను విడుదల చేయనున్నారు.

కర్రెగుట్ట అటవీప్రాంతంలోకి పర్యాటకులకు అనుమతి లేదు

హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): కర్రెగుట్ట అటవీప్రాంతంలోకి పర్యాటకులను అనుమతిస్తే తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీ అందజేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కర్రెగుట్ట ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా ప్రస్తుతానికి అక్కడికి పర్యాటకుల రాకను అనుమతించబోమని తేల్చిచెప్పారు. ఆ ప్రాంతంలో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో వివిధ రకాల మైన్లు (మందుపాతరలు) అమర్చారని డీజీపీ వివరించారు. ముఖ్యంగా ప్రెషర్ మైన్స్ ఎక్కువగా ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని, అవి ఎక్కడెక్కడ ఉన్నాయనే దానిపై స్పష్టమైన సమాచారం లేదన్నారు. కొంతమంది మావోయిస్టులను విచారించడంతో 9 డంప్‌లను గుర్తించాం అని ఆయన పేర్కొన్నారు. ఈ 9 డంప్‌ల నుంచి 252 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని డీజీపీ తెలిపారు. ఆ ప్రాంతంలో ఉన్న మైన్లను పూర్తిగా తొలగించి, క్లియరెన్స్ వచ్చిన తర్వాతే పర్యాటకులను అనుమతిస్తామని స్పష్టం చేశారు.

కేసీఆర్ సంతకాలతో తెలంగాణ జల హక్కులకు సమాధి!

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాల గురించి మాట్లాడిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటి వాటా కోసం ఎందుకు పోరాడలేదని రేవంత్ ప్రశ్నించారు. 2015 జూన్ 26న కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీల కేటాయింపులకు అంగీకరించారని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 575 టీఎంసీలు రావాలని వాదించకుండా కేసీఆర్, హరీశ్‌రావు రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారని ఆరోపించారు. తొలుత ఏటా కేటాయింపులపై చర్చించుకునే అవకాశం ఉన్నప్పటికీ, 2020 జనవరి 29న జరిగిన ఒప్పందంతో ఏపీకి 512 టీఎంసీల కేటాయింపులు కొనసాగించేలా అంగీకరించారని విమర్శించారు. నాడు సంతకాలు చేసిన బీఆర్ఎస్ నాయకులే ఇప్పుడు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పోతిరెడ్డిపాడు విస్తరణ విషయంలోనూ హరీశ్‌రావు పాత్ర ఉందని సీఎం ఆరోపించారు. 2005 మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనే పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచే అంశాన్ని ప్రస్తావించారని తెలిపారు. ఆ సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో అప్పటి టీఆర్ఎస్ నాయకులు మంత్రులుగా ఉన్నారని గుర్తుచేశారు. సెప్టెంబర్‌లో జీవో జారీ అయ్యేనాటికి తాను మంత్రిగా లేనని హరీశ్‌రావు చెబుతున్నప్పటికీ, అంతకుముందు బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన విషయాన్ని ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు. హంద్రీనీవా, ముచ్చుమర్రి, రాయలసీమ ఎత్తిపోతల పథకాల ద్వారా ఏపీకి నీటి తరలింపు సామర్థ్యం పెరగడానికి గత పాలకుల నిర్ణయాలే కారణమని ఆరోపించారు. పల్నాడు వాటర్ గ్రిడ్‌పై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను కూడా రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. 2022 ఫిబ్రవరి 16న వైఎస్ జగన్ ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద పల్నాడు, గుంటూరు జిల్లాలకు తాగునీటి సరఫరా కోసం జీవో నంబర్ 56 జారీ చేశారని తెలిపారు. అప్పట్లో తెలంగాణ సీఎంగా ఉన్న కేసీఆర్ ఈ పథకంపై అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆరోపించారు. కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తున్నప్పటికీ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు వద్ద ప్రశ్నించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాన్ని బోర్డు దృష్టికి తీసుకెళ్లామని, పనులను నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్రానికి ఫిర్యాదు చేశారని వెల్లడించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని సీఎం విమర్శించారు. 2014 నుంచి 2023 అక్టోబర్ వరకు భూసేకరణపై రూ.11,255 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. తమ ప్రభుత్వం భూసేకరణ, నిర్వాసితుల పునరావాసానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఉద్దండాపూర్ జలాశయం నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ కోసం రూ.600 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు మరో రూ.10 వేల కోట్లు వెచ్చించి ఉంటే అనేక ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ఏపీలో నీటి తరలింపు పథకాలకు అవకాశం కల్పించారని కేసీఆర్‌పై ఆరోపణలు చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల అంశంపై ప్రధానమంత్రిని రెండుసార్లు కలిశామని, ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న వివాదాస్పద ప్రాజెక్టులను చట్టబద్ధంగా అడ్డుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను ఆధారాలతో తిప్పికొడతామని, రాష్ట్ర జల హక్కుల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

ప్రపంచ పెట్టుబడులకు వేదికగా ఫ్యూచర్ సిటీ!

- 80 వేల చదరపు మీటర్లలో అతిపెద్ద బహుళ రంగ ప్రదర్శన
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- వెయ్యికి పైగా కంపెనీలు.. మూడు వేల మంది పారిశ్రామిక ప్రతినిధుల రాకకు ఏర్పాట్లు
- రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, ట్రైబల్ సమ్మిట్, విద్యా ప్రదర్శనలు
- ముఖ గుర్తింపు సాంకేతికతతో ప్రవేశం.. భద్రతపై ప్రత్యేక దృష్టి
- సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): ప్రపంచ పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026'ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుల్లో 80 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంతో అతిపెద్ద బహుళ రంగ ప్రదర్శనగా దీనిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే సదస్సు ఏర్పాట్లపై సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌లో రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఔషధ, జీవశాస్త్ర రంగాల ప్రదర్శనలు, వ్యవసాయ అనుబంధ రంగాల ఎక్స్‌పో, తెలంగాణ పెవిలియన్, విద్యా ప్రదర్శనలు, వాతావరణ మార్పులపై ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు. వివిధ రంగాలకు చెందిన వెయ్యికి పైగా కంపెనీలు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1,500 మంది కంపెనీల ముఖ్య కార్యనిర్వహణాధికారులు, మేనేజింగ్ డైరెక్టర్లు, పెట్టుబడిదారులు, రాయబారులు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారని, మరో 1,500 మంది పారిశ్రామిక ప్రతినిధులు రానున్నారని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రవేశ ద్వారాల వద్ద ముఖ గుర్తింపు సాంకేతికతను వినియోగించాలని, భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఆహ్వానాల పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు అతిథులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ముఖ్య అతిథులకు ఆహ్వానాలు పంపే బాధ్యతలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబులకు అప్పగించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని ఆదేశించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కాకతీయుల శిల్పకళ, సమ్మక్క--సారలమ్మ ఆలయ తోరణాలు, సోమశిల ఆలయం, నిర్మల్ చిత్రకళ, చేనేత వస్త్రాలు, భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులను ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, గాంధీ సరోవర్ ప్రాజెక్టు వంటి భవిష్యత్ కార్యక్రమాలను కూడా ప్రదర్శించాలన్నారు. సందర్శకుల కోసం 30 ఆహార విక్రయ కేంద్రాలు, చేనేత వస్త్రాల ప్రత్యేక ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్షా ఎక్స్‌పోలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వైమానిక ప్రదర్శనను ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు వీక్షించేలా అవకాశం కల్పించాలని సీఎం ఆదేశించారు. గిరిజన సదస్సులో భారత్‌తోపాటు వివిధ దేశాలకు చెందిన గిరిజన బృందాలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నాయి. వాతావరణ సదస్సులో సద్గురు జగ్గీ వాసుదేవ్, ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు, అంతర్జాతీయ నిపుణులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, అంకుర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయనున్నారు. హరిత ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులపై ప్రత్యేక చర్చలు నిర్వహించనున్నారు. విద్యా సదస్సులో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతోపాటు బ్రిటన్, ఐరోపా విద్యాసంస్థల ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఐఎస్‌బీ, ఐఐటీ హైదరాబాద్, నల్సార్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం తదితర సంస్థల ప్రతినిధులు అంతర్జాతీయ విద్యావేత్తలతో సమావేశమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్ 7న 'భవిష్యత్ పాఠశాలలు', 8న 'విద్యాసంస్థల్లో సంస్కరణలు' అంశాలపై జరిగే చర్చల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఇండియా జాయ్‌లో యానిమేషన్, దృశ్య ప్రభావాలు, గేమింగ్, కామిక్స్ రంగాలకు చెందిన సుమారు 150 కంపెనీలు పాల్గొననున్నాయి. అడోబ్, సోనీ, ఉబిసాఫ్ట్ వంటి సంస్థల ప్రదర్శనలు కూడా ఉండనున్నాయి.

నిమ్స్‌లో భారీ అవకతవకలు

- ఏసీబీ తనిఖీల్లో వెల్లడి
- రూ.5 కోట్ల విలువైన ఇంప్లాంట్ల అక్రమ నిల్వలు
- రోగుల డిశ్చార్జి తర్వాతా ఆరోగ్యశ్రీ బిల్లులు
- ఒకే రోగికి వారంలో 800 గ్లౌజుల వినియోగం
- టెండర్లు, క్యాంటీన్ నిర్వహణలోనూ అక్రమాలు
- రికార్డులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ



హైదరాబాద్, నవంబరు 23: నగరంలోని పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో భారీ అవకతవకలు జరిగినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తనిఖీల్లో వెల్లడైంది. ఆసుపత్రి నిర్వహణ, టెండర్లు, బిల్లుల చెల్లింపుల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ ఏసీబీ, టీజీ సేఫ్, డ్రగ్ కంట్రోల్, కార్మిక శాఖల ప్రత్యేక బృందాలు అక్టోబరు 29, నవంబరు 2 తేదీల్లో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో అక్రమాల వివరాలను వెల్లడించాయి. ఐదు ఆపరేషన్ థియేటర్లలో సుమారు రూ.5 కోట్ల విలువైన ఇంప్లాంట్లు, ఇతర వైద్య పరికరాలను ప్రైవేట్ వెండర్లు అనుమతులు లేకుండా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. మెయిన్ స్టోర్‌కు ఇండెంట్ పెట్టకుండానే వైద్యులు, సిబ్బంది నేరుగా వెండర్ల నుంచి సామగ్రి తీసుకుని వినియోగిస్తున్నట్లు తేలింది. అనంతరం యుటిలిటీ సర్టిఫికెట్లు, ఇన్వాయిస్‌ల ఆధారంగా బిల్లులు మంజూరు చేయించుకుంటున్నారని, దీనివల్ల వినియోగించని వస్తువులకు కూడా బిల్లులు పొందే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది. ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందిన రోగుల పేర్లతో డిశ్చార్జి తర్వాత కూడా బిల్లులు నమోదు చేసినట్లు తనిఖీల్లో బయటపడింది. కొన్ని సందర్భాల్లో రోగులు మరణించిన మూడు నెలల తర్వాత కూడా బిల్లులు ప్రాసెస్ చేసినట్లు గుర్తించారు. జులై నుంచి సెప్టెంబరు వరకు డిశ్చార్జి అయిన రోగుల పేర్లపై సుమారు రూ.66 లక్షల బిల్లింగ్ ఎంట్రీలు నమోదయ్యాయని వెల్లడించారు. సర్జికల్ వస్తువుల వినియోగంలోనూ అసాధారణ లెక్కలు చూపారని, ఒకే రోగికి వారం రోజుల్లో 800 గ్లౌజులు ఉపయోగించినట్లు రికార్డుల్లో నమోదు చేశారని తెలిపారు. 2019-2025 మధ్య మ్యాన్‌పవర్ సేవలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తిచేయకుండానే కార్యకలాపాలు కొనసాగించినట్లు అధికారులు గుర్తించారు. కార్మికుల నియామకాలు, సెమీ స్కిల్డ్ కేటగిరీకి మార్చే విషయంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయని పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రధాన క్యాంటీన్‌లో అపరిశుభ్రతతోపాటు గడువు ముగిసిన ఆహార పదార్థాలను గుర్తించారు. క్యాంటీన్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ కూడా లేదని తేలింది. కార్మిక చట్టాల ఉల్లంఘనలతోపాటు టెండర్ ప్రక్రియలో బిడ్డర్లు కుమ్మక్కైనట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. మెడికల్ షాపుల్లో విక్రయ రికార్డులు నిర్వహించకపోవడం, రిజిస్టర్ కాని కార్మికులను నియమించుకోవడం కూడా తనిఖీల్లో వెలుగుచూశాయి. సెక్యూరిటీ సేవలకు సంబంధించి కొత్త టెండర్లు ఖరారు చేయకుండా పాత కాంట్రాక్టులను పదేపదే పొడిగించినట్లు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఓ ఏజెన్సీకి చెందిన రూ.28.13 లక్షల బ్యాంకు గ్యారంటీని కూడా జప్తు చేయలేదని ఏసీబీ వెల్లడించింది. ఈ వ్యవహారాలపై మరింత విచారణ జరిపేందుకు నోట్ ఫైళ్లు, ఒప్పంద పత్రాలు, ఇతర కీలక రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ భూములు అమ్మడానికి మీరేమైనా రియల్ ఎస్టేట్ వ్యాపారులా?

ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం



హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): ప్రజావసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాదిరిగా వేలం వేయడం ఎంతవరకు సమంజసమని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ప్రభుత్వాలు ప్రజల అవసరాలను తీర్చడానికి పనిచేయాలి తప్ప భూములు అమ్మి ఆదాయం సమకూర్చుకునే వ్యాపార సంస్థల్లా వ్యవహరించకూడదని విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వై జంక్షన్ మెట్రో సమీపంలో ఉన్న హుడా ట్రక్ పార్కింగ్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ప్రజల అవసరాల కోసం కేటాయించిన విలువైన భూములను ప్రభుత్వం వేలం వేసుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రజలకు, రాబోయే తరాలకు ఖాళీ స్థలాలే మిగలవని ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా సౌకర్యాల కల్పనకు ప్రభుత్వ స్థలాలు అవసరమని పేర్కొన్నారు. అలాంటి భూములను కాపాడాల్సిన ప్రభుత్వమే విక్రయానికి పెట్టడం సరికాదన్నారు. పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములతోపాటు ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. హుడా ట్రక్ పార్కింగ్ స్థలం వేలాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసనను ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంగా ఈటల అభివర్ణించారు. ప్రభుత్వ భూములను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్లు మావే.. చోరీ ఆరోపణలు మీవే!

- రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ధ్వజం
- ఓటర్ల జాబితా సవరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్న
- మృతులు, వలస వెళ్లినవారి పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ తీరును తప్పబట్టిన వైనం
- రాహుల్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఏటీఎంలా మారారని ఆరోపణ
- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందంటూ వ్యాఖ్యలు



కరీంనగర్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజలు, ఓట్లు రెండూ బీజేపీ వెంటే ఉన్నాయని, ఓట్ల చోరీ పేరుతో కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన మహాపాదయాత్ర, బహిరంగ సభలో పాల్గొన్న ఆయన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను సమర్థించారు. జాబితాలోని తప్పులను సరిదిద్దడాన్ని కాంగ్రెస్, ఇండియా కూటమి ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా మూడు కోట్ల మంది మృతుల పేర్లు ఓటర్ల జాబితాల్లో ఉన్నాయని, మరో ఆరు కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని నితిన్ నబీన్ పేర్కొన్నారు. అలాంటి పేర్లను తొలగించకుండా కొనసాగించాలా అని ప్రశ్నించారు. ఒకే వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉండాలా అని నిలదీశారు. 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ రాహుల్ గాంధీ చేస్తున్న ప్రచారంలో నిజం లేదని ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకించడం ద్వారా కాంగ్రెస్ చొరబాటుదారులకు మద్దతుగా నిలుస్తోందని విమర్శించారు. అయితే ఆయన ప్రస్తావించిన గణాంకాలు, ఆరోపణలకు స్వతంత్ర నిర్ధారణ అవసరం. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరిగే కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ సంస్థలను గౌరవించడం లేదని నితిన్ నబీన్ విమర్శించారు. “మీ చేతుల్లో రాజ్యాంగం ప్రతి మాత్రమే ఉంది.. మా గుండెల్లో రాజ్యాంగం ఉంది” అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు దేశ ప్రయోజనాల కంటే కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా పేదల ఖాతాల్లోకి చేరుతున్నాయని, అవినీతిని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాజకీయాలపైనా నితిన్ నబీన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి ఒక ‘ఏటీఎం’లా మారారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ నాయకత్వానికి చేరవేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి కంటే ఢిల్లీ పెద్దల మెప్పు పొందడానికే సీఎం ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని, కానీ ప్రస్తుత పాలనపైనా అసంతృప్తి పెరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలను ఆయన ప్రసంగంలో సమర్పించినట్లు అందిన వివరాల్లో లేదు. కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సొంత జిల్లా అని గుర్తుచేసిన నితిన్ నబీన్, ఆయనకు కాంగ్రెస్ నాయకత్వం తగిన గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ కార్యకర్తలు పోరాటం చేస్తారని ప్రకటించారు. 2029లోనూ మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలకు కరీంనగర్ వేదికగా నితిన్ నబీన్ ఇచ్చిన ప్రతిస్పందన రాజకీయ చర్చకు దారితీసింది.





కాంగ్రెస్‌లో ముఠా తగాదాల్లేవు..
ప్రజా వ్యతిరేకతా లేదు!

కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జితో భేటీ అనంతరం పొంగులేటి స్పష్టీకరణ

బీఎం సందీప్‌తో మర్యాదపూర్వకంగానే సమావేశమయ్యానని వెల్లడి

గాంధీ భవన్‌లో మంత్రులతో కొత్త ఇన్‌చార్జి వరుస భేటీలు

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యవహారాలపై పార్టీలో చర్చ

హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి ముఠా తగాదాలు, అంతర్గత విభేదాలు లేవని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్‌తో గాంధీ భవన్‌లో సమావేశమైన అనంతరం పొంగులేటి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి తొలిసారి వచ్చిన కొత్త ఇన్‌చార్జిని మర్యాదపూర్వకంగానే కలిశానని తెలిపారు. పార్టీ బలోపేతం, సంస్థాగత అంశాలపైనే చర్చించామని, అంతర్గత వివాదాలేవీ ప్రస్తావనకు రాలేదని వెల్లడించారు. మరోవైపు కొత్త ఇన్‌చార్జి బీఎం సందీప్ గాంధీ భవన్‌లో వరుస సమావేశాలు నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో విడివిడిగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గాల్లో పార్టీ స్థితిగతులు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన అంశాలపై మంత్రుల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. నాయకుల మధ్య సమన్వయం పెంచడంతోపాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్ఠం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు సమష్టిగా పనిచేయాలని సందీప్ సూచించినట్లు తెలుస్తోంది. జిల్లాలవారీగా పార్టీ బలాబలాలు, నాయకుల మధ్య సమన్వయం, ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇటీవల కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యవహారాలు కూడా కొత్త ఇన్‌చార్జి దృష్టికి వెళ్లే అవకాశమున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ అంశాలపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఫిర్యాదు చేసే అవకాశమున్నట్లు సమాచారం. డీసీసీ అధ్యక్షులతోపాటు పీసీసీ ముఖ్య నేతలు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులతోనూ సందీప్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

ఏం చేశారని కాంగ్రెస్‌కు 90 సీట్లు వస్తాయి?

సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సూటి ప్రశ్న

నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 హామీల సంగతేంటని నిలదీత



కరీంనగర్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 స్థానాలు వస్తాయంటూ సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేశారని, ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశారని కాంగ్రెస్‌కు ప్రజలు 90 సీట్లు ఇస్తారని ప్రశ్నించారు. సోమవారం కరీంనగర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పకుండా ఎన్నికల్లో భారీ విజయాలు సాధిస్తామంటూ ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు ఎంతమందికి ఆ ప్రయోజనం అందించిందో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో విఫలమైందని ఆరోపించారు. హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిపై ఉందన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలనపై ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీకి అధికారం అప్పగించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ సమరం ఇప్పటికే ప్రారంభమైందని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంలోనూ కాంగ్రెస్ నాయకుల తీరును బండి సంజయ్ తప్పుబట్టారు. ఓటర్ల జాబితాలో మృతుల పేర్లను తొలగిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. అనర్హుల పేర్లను తొలగించడాన్ని కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ అనవసర వివాదం సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రిని ఎవరు నిర్ణయించాలన్నది ప్రజల చేతుల్లోనే ఉంటుందని, ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయం ఓటర్లదేనని పేర్కొన్నారు.

జనగాం మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి
ఏర్పాట్లు చేయాలి

ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ ఆదేశం



హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): జనగాం మెడికల్ కాలేజీ భవనం, క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. కరీంనగర్ మెడికల్ కాలేజీ, హాస్టల్స్, సిద్ధిపేట టీచింగ్ హాస్పిటల్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హుస్నాబాద్ ఏరియా హాస్పిటల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కూడా ఆదేశించారు. ఆయా భవనాల నిర్మాణ పురోగతిపై సచివాలయంలో మంత్రి సోమవారం సమీక్షించారు. జనగాం మెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, సుమారు రూ.154 కోట్లు వెచ్చించి అత్యాధునిక వసతులతో ఈ భవనాలను ప్రభుత్వం నిర్మించిందని అధికారులు వివరించారు. కాలేజీ, సీసీబీ భవనాల ప్రారంభోత్సవానికి వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ మెడికల్ కాలేజీ, హాస్టల్ భవనాల నిర్మాణ పనులు ఆలస్యం అవుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల చివరికల్లా గర్ల్స్ హాస్టల్, డిసెంబర్ చివరికల్లా బాయ్స్ హాస్టల్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి చివరి నాటికి మెడికల్ కాలేజీ భవనాన్ని సైతం విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని మంత్రి ఆదేశించారు. సిద్ధిపేట టీచింగ్ హాస్పిటల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి మార్చి చివరి వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. సిద్ధిపేట మెడికల్ కాలేజీ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, నర్సింగ్ కాలేజీ, ఆయుష్ హాస్పిటల్ తదితర సంస్థలకు మాజీ మంత్రి, దివంగత అనంతుల మదన్ మోహన్ పేరు పెడుతూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే ఆయా సంస్థల బోర్డులు మార్చాలని, ప్రభుత్వ రికార్డులు, వెబ్‌సైట్లలోనూ పేరును అప్‌డేట్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు, ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హుస్నాబాద్ ఏరియా హాస్పిటల్‌ను వంద బెడ్ల నుంచి 250 బెడ్లుగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, రూ.82 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టింది. ఈ పనులను వేగంగా పూర్తి చేయించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. హుస్నాబాద్‌లో మెడికల్ పీజీ కాలేజీని సైతం ఏర్పాటు చేయనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ గుర్తు చేశారు. తమ పరిధిలోని మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లు, హాస్టళ్ల నిర్మాణ పనులు, ఇతర అంశాలపై రెగ్యులర్ సమీక్షలు జరపాలని, ప్రతి వారం తనకు నివేదిక అందజేయాలని కలెక్టర్లను మంత్రి దామోదర్ ఆదేశించారు. సమీక్షలో ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ ఫరూఖీ, డీఎంఈ వాణి, అకాడమిక్ డీఎం రమాదేవి, కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట్, జనగాం కలెక్టర్లు చిత్రా మిశ్రా, సత్య చంద్రిక, హైమావతి, సందీప్ కుమార్ ఝా, ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై పీటముడి

- నీళ్లివ్వలేమన్న తెలంగాణ!
- 19 టీఎంసీలు కావాలని పట్టుబట్టిన ఏపీ
- ఏకాభిప్రాయం కుదరకుండానే ముగిసిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ భేటీ

హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): కృష్ణా జలాల పంపకాలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి విభేదాలు తలెత్తాయి. నాగార్జునసాగర్ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ పట్టుబట్టగా, ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్క చుక్క కూడా ఇవ్వలేమని తెలంగాణ స్పష్టం చేసింది. దీంతో సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో నీటి కేటాయింపుల అంశాన్ని పూర్తిస్థాయి బోర్డు సమావేశానికి వాయిదా వేశారు. సమావేశంలో తమ అవసరాల కోసం 19 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరింది. మరోవైపు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు తమకు 21 టీఎంసీలు అవసరమని తెలంగాణ ప్రతిపాదించింది. రెండు రాష్ట్రాలు తమ అవసరాల మేరకు నీటి కేటాయింపులు జరగాలని పట్టుబట్టడంతో బోర్డు అధికారులు నిర్ణయానికి రాలేకపోయారు. ఇదే సమయంలో పల్నాడు వాటర్ గ్రిడ్ అంశాన్ని తెలంగాణ అధికారులు ప్రస్తావించగా, ఆ పనులు గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో ఉన్నాయని, తమ వద్ద పూర్తి వివరాలు లేవని ఏపీ జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్‌బాబు మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం వినియోగానికి అందుబాటులో ఉన్న నీరు 45 టీఎంసీలు మాత్రమేనని తెలిపారు. వచ్చే ఏడాది జూలై వరకు ఈ నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగర తాగునీటి అవసరాల కోసం కనీసం 15 టీఎంసీలు అవసరమవుతాయని, మరో 5 టీఎంసీలు ఆవిరయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ లెక్కన మిగిలే 25 టీఎంసీల వినియోగంపైనే చర్చించాలని బోర్డుకు సూచించినట్లు వెల్లడించారు. సాగర్ నీటిని తాగునీటి అవసరాలతోపాటు కుడి, ఎడమ కాల్వల పరిధిలోని అవసరాలకు మాత్రమే వినియోగించాలని తెలంగాణ కోరినట్లు రమేశ్‌బాబు తెలిపారు. కృష్ణా డెల్టాకు నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికే పులిచింతల జలాశయంలో 42 టీఎంసీల నీరు ఉందని, పట్టిసీమ ద్వారా కూడా డెల్టాకు నీరు అందుతోందని గుర్తుచేశారు. అందువల్ల సాగర్ నుంచి అదనంగా నీటిని కోరడం సమంజసం కాదన్నది తెలంగాణ వాదనగా పేర్కొన్నారు. మరోవైపు ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి మాట్లాడుతూ కృష్ణా డెల్టా తాగు, సాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాల్సిందేనని బోర్డు వద్ద పట్టుబట్టినట్లు తెలిపారు. ఈ అంశంపై పది రోజుల క్రితమే కేఆర్ఎంబీకి అధికారికంగా లేఖలు రాసినట్లు వెల్లడించారు. డెల్టా అవసరాలను పరిగణనలోకి తీసుకుని నీటి కేటాయింపులు చేయాలని కోరామన్నారు. పల్నాడు వాటర్ గ్రిడ్‌పై సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని ఆయన పేర్కొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



అనర్హుల రేషన్ కార్డులకు కేంద్రం చెక్!

దేశవ్యాప్తంగా రేషన్ కార్డుల ఏరివేతకు రంగం సిద్ధం

ఉచిత రేషన్ లబ్ధిదారుల్లో 13.2 శాతం అనర్హులున్నట్లు అధ్యయనం

కారు, ఏసీ, ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నవారికీ ఉచిత బియ్యం!

పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 39.5 శాతం అనర్హులు

రాష్ట్రాల సహకారంతో ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతానికి కసరత్తు

న్యూఢిల్లీ, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): దేశవ్యాప్తంగా అనర్హుల రేషన్ కార్డుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద ఉచిత రేషన్ పొందుతున్న వారిలో పెద్ద సంఖ్యలో అనర్హులు ఉన్నట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. కారు, ఏసీ వంటి సౌకర్యాలు కలిగి ఉన్నవారితోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలు కూడా ఉచిత రేషన్ ప్రయోజనాలు పొందుతున్నట్లు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. దీంతో అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా రేషన్ కార్డుల పరిశీలనను కట్టుదిట్టం చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 51,303 లబ్ధిదారుల కుటుంబాలపై కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధ్యయనం నిర్వహించింది. ఈ అధ్యయనం ప్రకారం ఉచిత రేషన్ పొందుతున్న వారిలో జాతీయ స్థాయిలో 13.2 శాతం మంది అనర్హులుగా గుర్తించినట్లు వెల్లడైంది. పట్టణ ప్రాంతాల్లోని ప్రాధాన్యతా కుటుంబాల విభాగంలో ఈ సంఖ్య 15.7 శాతంగా నమోదైంది. ఆదాయ, ఆస్తుల వివరాలు, ఇతర అర్హత ప్రమాణాల ఆధారంగా ఈ అంచనాలు రూపొందించినట్లు సమాచారం. రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 39.5 శాతం మంది అనర్హులు ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది. త్రిపురలో 39.2 శాతం, తమిళనాడులో 38.7 శాతం, మేఘాలయలో 28.5 శాతం మంది అనర్హులుగా ఉన్నట్లు అంచనా వేసింది. ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలు కూడా ఉచిత రేషన్ పథకంలో కొనసాగడం వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడటంతోపాటు నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోందని అధికారులు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ఆయా రాష్ట్రాల్లో అమల్లో ఉన్న అర్హత నిబంధనల ప్రకారం అనర్హులను గుర్తించడంపై దృష్టి సారించనున్నట్లు సమాచారం. అయితే కారు లేదా ఏసీ ఉన్నంత మాత్రాన అన్ని రాష్ట్రాల్లోనూ రేషన్ కార్డు రద్దవుతుందని భావించరాదని, ఆయా రాష్ట్రాల అర్హత నిబంధనలే కీలకమని గుర్తించాలి. కేంద్ర అధ్యయనంలో వెల్లడైన గణాంకాల నేపథ్యంలో రేషన్ కార్డుల పరిశీలన అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే దేశవ్యాప్తంగా కార్డుల రద్దుకు సంబంధించి తుది మార్గదర్శకాలు, అమలు తేదీలు వెల్లడికావాల్సి ఉంది. అర్హులైన పేదలకు ఇబ్బందులు కలగకుండా, అనర్హులను మాత్రమే గుర్తించేలా పారదర్శకంగా పరిశీలన చేపట్టడం కీలకం కానుంది.

ఆదాయం లేకపోవడం మాత్రమే పేదరికం కాదు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): పేదరికంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇల్లు, తాగునీరు, వైద్యం వంటి కనీస అవసరాలకు కూడా నోచుకోలేకపోవడం పేదరికం కిందకే వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు లింక్డిన్‌లో సుదీర్ఘ పోస్టు రాసుకొచ్చారు. భారత్‌లో 50 కోట్ల మంది కటిక పేదరికాన్ని జయించారంటూ ప్రపంచబ్యాంక్ నివేదిక వెలువరించిన నేపథ్యంలో ఈ పోస్ట్ పెట్టారు. “డబ్బు లేకపోవడం ఒక్కటే పేదరికం కాదు. ఇల్లు, నీరు వంటి ప్రాథమిక అవసరాలు కూడా అందుబాటులో ఉండాలి. ఒక్క తీవ్రమైన అనారోగ్యం కుటుంబాన్ని కటిక పేదరికంలోకి నెట్టేస్తుంది” అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దశాబ్దకాలంలో భారత్ పేదరికాన్ని అధిగమించిందని గుర్తు చేశారు. మోదీ సర్కారు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, చొరవతోనే ఇది సాధ్యమైందన్నారు. 2011-23లో దేశంలో దాదాపు 50 కోట్ల మంది పేదరికాన్ని జయించారంటూ ప్రపంచబ్యాంక్ నివేదిక ఇవ్వడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకొచ్చే పథకాలు.. చివరి వ్యక్తికి చేరే వరకు ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షిస్తారని నిర్మలా పేర్కొన్నారు. అంత్యోదయ లక్ష్యంతో స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ముద్ర రుణాలు వంటి పథకాలు లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇలానే.. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కారు పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా నాగాలాండ్‌లోని కిఫిరే జిల్లాలో చిరుధాన్యాల ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న లఖ్‌పతి దీదీ ఎస్థర్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుష్మితా ఘరాయ్ ముద్ర రుణంతో తమ కుటుంబ ప్రింటింగ్ వ్యాపారాన్ని తిరిగి నిలబెట్టుకున్న సంఘటనలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

బిస్లేరీ నీటి నాణ్యతపై దుమారం!

- పరీక్షల్లో నమూనాలు విఫలమయ్యాయంటూ ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలు
- కంపెనీపై కేసు నమోదుకు అనుమతి మంజూరు
- 14 నెలల నాటి వ్యవహారమేనంటూ బిస్లేరీ వివరణ
- ఆరు నమూనాల్లో ఐదు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగానే ఉన్నాయని వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): దేశవ్యాప్తంగా ప్రముఖ ప్యాకేజ్డ్ తాగునీటి సంస్థ బిస్లేరీ నాణ్యతపై వివాదం చెలరేగింది. సంస్థకు చెందిన నీటి నమూనాలు నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయన్న అంశంపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) న్యాయపరమైన చర్యలకు అనుమతి మంజూరు చేసినట్లు వెల్లడైంది. దీంతో బిస్లేరీ నీటి భద్రతపై చర్చ మొదలైంది. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వ్యవహారం కొత్తది కాదని, దాదాపు 14 నెలల క్రితం గోవాలోని తమ తయారీ కేంద్రంలో ఉత్పత్తి చేసిన ఒక బ్యాచ్‌కు సంబంధించినదని బిస్లేరీ ఇంటర్నేషనల్ స్పష్టం చేసింది. నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని పేర్కొంది. బిస్లేరీ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2025 సెప్టెంబర్ 30న ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు గోవాలోని తయారీ కేంద్రం నుంచి ఆరు నీటి నమూనాలను సేకరించారు. వాటిలో ఐదు నమూనాలు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని కంపెనీ తెలిపింది. ఆరో నమూనాలో మాత్రం ప్రాథమిక పరీక్ష సందర్భంగా బ్రోమేట్ పరిమాణం లీటరుకు 12 మైక్రోగ్రాములుగా నమోదైంది. అనుమతించిన పరిమితి లీటరుకు 10 మైక్రోగ్రాములు కాగా, రెండు మైక్రోగ్రాములు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ అంశమే వివాదానికి కారణమైందని సంస్థ వివరించింది. ప్రాథమిక పరీక్ష ఫలితాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2025 నవంబర్‌లో అప్పీలు చేసినట్లు బిస్లేరీ తెలిపింది. అనంతరం నమూనాను రిఫరల్ ప్రయోగశాలకు పంపగా, బ్రోమేట్ స్థాయి నిర్దేశిత పరిమితిలోనే ఉన్నట్లు తేలిందని పేర్కొంది. అయితే ఆ పరీక్షలో పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్ల ఉనికిని గుర్తించినట్లు నివేదిక వెల్లడించిందని వివరించింది. రెండు ప్రయోగశాలల ఫలితాల్లో వైరుధ్యాలు ఉండటంతో అదే తేదీన తయారైన, అదే బ్యాచ్‌కు చెందిన నీటిని ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రయోగశాలలో మరోసారి పరీక్షించామని తెలిపింది. ఆ పరీక్షల్లో నీరు అన్ని భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు తేలిందని కంపెనీ పేర్కొంది. మరోవైపు, రెండు వేర్వేరు ప్రయోగశాలల పరీక్షల్లో నమూనా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదన్న కారణంతో బిస్లేరీపై న్యాయస్థానంలో కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు నవంబర్ 22న ఎఫ్ఎస్-ఎస్ఏఐ వెల్లడించినట్లు సమాచారం. ఈ పరిణామంతో పాత వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. అయితే స్వతంత్ర ప్రయోగశాల నివేదిక తమ వాదనకు బలం చేకూరుస్తోందని బిస్లేరీ చెబుతోంది. వినియోగదారులకు సురక్షితమైన తాగునీటిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని బిస్లేరీ ఇంటర్నేషనల్ స్పష్టం చేసింది. తయారీ ప్రక్రియ నుంచి సరఫరా వరకు నాణ్యతా ప్రమాణాలను కఠినంగా పాటిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని నియంత్రణ సంస్థతో కలిసి చట్టపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించుకుంటామని పేర్కొంది. కాగా, కేసు నమోదుకు అనుమతి ఇవ్వడం అంటే కంపెనీ తప్పు రుజువైనట్లు కాదని, తుది నిర్ణయం న్యాయపరమైన విచారణపై ఆధారపడి ఉంటుందని గమనించాలి. ప్రయోగశాలల నివేదికల్లో తేడాల నేపథ్యంలో ఈ వివాదం ఎలాంటి మలుపు తిరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

గోద్రా రైలు దహనం కేసు

17 ఏళ్ల తర్వాత వైద్య కారణాలతో దోషికి బెయిల్ మంజూరు

జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇర్ఫాన్ సిరాజ్ పడాకు ఊరట

న్యూఢిల్లీ, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): గోద్రా రైలు దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇర్ఫాన్ సిరాజ్ పడాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తీవ్రమైన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో పాటు, ఇప్పటికే 17 ఏళ్లకు పైగా జైలులో గడిపిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సర్వోన్నత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. సోమవారం (నవంబర్ 23) జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇర్ఫాన్‌కు ఉన్న తీవ్రమైన గుండె సంబంధిత అనారోగ్య పరిస్థితిని గుజరాత్ ప్రభుత్వం కూడా వ్యతిరేకించకపోవడంతో, వైద్య కారణాలతో అతడి శిక్షను తాత్కాలికంగా నిలిపివేస్తూ బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం అంగీకరించింది. 2002 ఫిబ్రవరి 27న గుజరాత్‌లోని గోద్రా వద్ద సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలులోని ఎస్-6 బోగీలో మంటలు చెలరేగిన ఘటనలో అయోధ్య నుంచి తిరిగి వస్తున్న 58 మంది కరసేవకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అనంతరం గుజరాత్‌లో తీవ్ర మత ఘర్షణలు చెలరేగాయి. ఈ కేసును విచారించిన ప్రత్యేక న్యాయస్థానం 2011 మార్చిలో 31 మందిని దోషులుగా నిర్ధారిస్తూ.. వారిలో 11 మందికి మరణశిక్ష, మరో 20 మందికి జీవిత ఖైదు విధించింది. అయితే, 2017లో గుజరాత్ హైకోర్టు 11 మంది మరణశిక్షలను జీవిత ఖైదులుగా మారుస్తూ తీర్పునిచ్చింది. కాగా, ఈ కేసులో గతంలోనూ పలువురు దోషులకు సుప్రీంకోర్టు వివిధ కారణాలతో బెయిల్ మంజూరు చేసింది. 2022లో ఇద్దరికి, 2023 ఏప్రిల్‌లో మరో ఎనిమిది మంది దోషులకు బెయిల్ ఇవ్వగా, తాజాగా ఇర్ఫాన్ సిరాజ్ పడాకు వైద్య కారణాలతో బెయిల్ లభించింది.





ఆసియాలో మూడో మహాశక్తిగా భారత్!

రెండో అత్యంత సమర్థ నేతగా ప్రధాని మోదీ!

సిడ్నీ/న్యూఢిల్లీ, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): ఆసియా పవర్ ఇండెక్స్-2025లో 'ప్రధాన శక్తి' హోదాకు భారత్ చేరుకుందని ఆస్ట్రేలియా సంస్థ లోవీ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఆసియాలోనే మూడో శక్తిమంతమైన దేశంగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్లు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ రెండో అతి శక్తిమంతమైన నేతగా రికార్డు సృష్టించారు. పెరిగిన ప్రాంతీయ రక్షణ భాగస్వామ్యం, ఆగ్నేయాసియా దేశాలకు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయాలు దేశ రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేశాయని లోవీ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. అదే సమయంలో స్థిరమైన వాణిజ్య, పెట్టుబడి, ఆర్థిక సంబంధాలు భారత్‌ను మరింత ముందుకు నడిపించినట్లు విశ్లేషించింది. ఆసియా దేశాల శక్తి సామర్థ్యాలు, అంతర్జాతీయంగా చూపించే ప్రభావం ఆధారంగా వార్షిక ఆసియా పవర్ ఇండెక్స్‌ను నిర్ణయిస్తారు. ఆసియా పవర్ ఇండెక్స్-2025లో 40 పాయింట్ల స్కోరుతో ఉన్న భారత్, ఈ ఏడాదిలో మరో 0.5 పాయింట్లు మెరుగుపడి 40.5 పాయింట్లకు చేరింది. దీంతో 2018 తర్వాత చైనాతో భారత్‌కున్న అంతరం భారీగా తగ్గింది. 100 పాయింట్లకు గానూ అమెరికా 78.9 స్కోరుతో, చైనా 73.6 స్కోరుతో 2026 నాటికి ఆసియాలో అగ్రరాజ్యాలుగా కొనసాగుతున్నాయి. నాయకత్వ సామర్థ్యాల విషయానికొస్తే.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తర్వాత ఆసియాలో రెండో అత్యంత సమర్థమైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ నిలిచారు.

రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

'జ్వాలా ఎంకే-1' కౌంటర్ డ్రోన్ మిసైల్ పరీక్ష విజయవంతం!

సైనిక స్థావరాలు, కీలక రక్షణ ప్రాంతాల భద్రతకు ఉపయోగకరం

జైపూర్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): రక్షణ రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన స్వయంప్రతిపత్తి కౌంటర్ డ్రోన్ సూక్ష్మ క్షిపణి వ్యవస్థ 'జ్వాలా ఎంకే-1'ను రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ రంగ సంస్థ ఐజీ డిఫెన్స్ వెల్లడించింది. ఆధునిక యుద్ధాల్లో శత్రు డ్రోన్ల నుంచి ఎదురవుతున్న ముప్పును సమర్థంగా ఎదుర్కొనే లక్ష్యంతో ఈ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపింది. నిఘా, గూఢచర్యం, దాడుల కోసం వినియోగించే డ్రోన్లను గుర్తించి, వాటిని అడ్డుకునేలా అత్యాధునిక సాంకేతికతను ఇందులో పొందుపరిచినట్లు పేర్కొంది. ఐజీ డిఫెన్స్ వివరాల ప్రకారం.. జ్వాలా ఎంకే-1 వ్యవస్థ 2 నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వైమానిక లక్ష్యాలను ఎదుర్కోగలదు. భూమికి 50 మీటర్ల నుంచి 5 వేల మీటర్ల ఎత్తులో ప్రయాణించే డ్రోన్లను ఛేదించే సామర్థ్యంతో దీనిని రూపొందించారు. ముఖ్యంగా చిన్నపాటి డ్రోన్లను గుర్తించి వాటి కదలికలను విశ్లేషించడం, అవసరమైన సమయంలో ప్రతిచర్యలు చేపట్టడం ఈ వ్యవస్థ ప్రత్యేకతగా సంస్థ పేర్కొంది. జ్వాలా ఎంకే-1లో 'గ్రిడ్' పేరుతో కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. వివిధ సెన్సార్ల నుంచి సమాచారాన్ని సేకరించి శత్రు డ్రోన్లను గుర్తించడం, వాటి స్వభావాన్ని విశ్లేషించడం, లక్ష్యాన్ని ఎదుర్కొనే చర్యలను సమన్వయం చేయడం ఈ సాంకేతికత ప్రధాన విధి. మిషన్ నిర్వహణ నుంచి నిర్ణయ ప్రక్రియ వరకు పలు కార్యకలాపాలను సమన్వయం చేసేలా దీనిని అభివృద్ధి చేసినట్లు సంస్థ తెలిపింది. మరోవైపు జ్వాలా ఎంకే-1ను నాలుగు చక్రాల డ్రైవ్ కలిగిన వాహనంపై అమర్చిన బహుళ క్షిపణి ప్రయోగ వ్యవస్థ ద్వారా ప్రయోగించేలా రూపొందించారు. దీంతో అవసరాన్ని బట్టి సరిహద్దు ప్రాంతాలు, సైనిక స్థావరాలు, ఇతర కీలక రక్షణ కేంద్రాలకు వేగంగా తరలించి మోహరించే అవకాశం ఉంటుంది. స్థిరమైన రక్షణ వ్యవస్థలతోపాటు సంచార రక్షణ అవసరాలకు కూడా ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనే దేశీయ సాంకేతికతకు ప్రాధాన్యం పెరిగింది. తక్కువ ఎత్తులో ప్రయాణించే చిన్న డ్రోన్లు సైతం కీలక సైనిక స్థావరాలకు ముప్పుగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జ్వాలా ఎంకే-1 వంటి కౌంటర్ డ్రోన్ వ్యవస్థలు రక్షణ రంగానికి ఉపయోగపడనున్నాయి. పోఖ్రాన్‌లో నిర్వహించిన పరీక్ష విజయవంతమైందని ఐజీ డిఫెన్స్ ప్రకటించడం దేశీయ రక్షణ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో మరో ముందడుగుగా నిలిచింది.





26న చలో ధనోరా - మాణిక్‌గూడ

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న నిర్వహించనున్న చలో ధనోరా – మాణిక్ గూడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. సోమవారం మిషన్ భగీరథ ఈఈ కార్యాలయంలో సూపరింటెండెంట్ అర్షద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ సెగ్మెంట్ పరిధిలోని ఎల్ అండ్‌టీ, రాఘువ, సురక్ష, స్టాండర్డ్ ఇన్‌ఫ్రా, మేఘ ఏజెన్సీలలో పనిచేస్తున్న కార్మికులకు ఎస్–ఎస్ఆర్ ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. అదేవిధంగా ఈపీఎఫ్, ఈఎస్ఐ జమ చేయడం లేదని, ప్రతినెలా పే స్లిప్లు అందించడం లేదని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై పలుమార్లు వినతిపత్రాలు అందించినప్పటికీ పరిష్కారం లభించకపోవడంతో గురువారం చలో ధనోరా – మాణిక్ గూడ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ కార్మికులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నా వాటా భూమి ఇప్పించండి

కరీంనగర్ కలెక్టర్‌ను ఆశ్రయించిన మహిళ



కరీంనగర్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): కరీంనగర్ జిల్లాలో కుటుంబ భూ వివాదానికి సంబంధించి ఓ మహిళ జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించింది. తనకు రావాల్సిన భూమి విషయంలో అన్యాయం జరిగిందని, తనకు తెలియకుండా భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. కుటుంబానికి సంబంధించిన భూమి పంపకాల విషయంలో వివాదం తలెత్తినట్లు మహిళ తెలిపింది. తన భర్త వాటాకు రావాల్సిన భూమిపై తనకు హక్కు ఉందని, అయితే సంబంధిత భూమి విషయంలో తనకు తెలియకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగినట్లు ఆమె ఆరోపించింది. తనకు రావాల్సిన భూమిపై న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. అక్రమంగా జరిగిన భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, సంబంధిత భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేసింది. కాగా, ఈ ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ, అధికారుల విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది.

బొగ్గు గనుల్లో కార్మికుల చెమట

వేతనాల పెంపులో మాత్రం జాప్యం!

12వ వేజ్ బోర్డు ఎక్కడ?.. కార్మికుల నిరీక్షణకు ముగింపెప్పుడు?

జూలై 1 నుంచి అమలు కావాల్సిన కొత్త వేతన ఒప్పందంపై అనిశ్చితి

40 శాతం మధ్యంతర ఉపశమనం కోసం కార్మిక సంఘాల డిమాండ్

అధికారుల వేతన సవరణకు నిర్ణయం.. కార్మికుల విషయంలో ఎందుకీ ఆలస్యం?

పెన్షన్, వైద్య సదుపాయాల కోసం విశ్రాంత ఉద్యోగుల ఎదురుచూపులు

డిసెంబర్‌లో సింగరేణి పరిరక్షణ యాత్రకు టీబీబీకేఎస్ సన్నాహాలు

> జూలై 1, 2026 నుంచి అమల్లోకి రావాల్సిన కొత్త వేతన ఒప్పందం నవంబర్ వచ్చినా కమిటీ ఏర్పాటు దశ దాటకపోవడంతో సింగరేణి కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వేజ్ బోర్డు చర్చలు పూర్తయ్యే వరకు 40 శాతం మధ్యంతర ఉపశమనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్న కార్మిక వర్గం.. అధికారుల వేతన సవరణకు మార్గం సుగమమై, తమ వంతు ఎప్పుడంటూ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తోంది.



(ఉద్యమ కెరటం, మంచిర్యాల బ్యూరో)

మంచిర్యాల, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): భూగర్భంలో ప్రాణాలకు తెగించి బొగ్గును వెలికితీసే కార్మికుల శ్రమతో సింగరేణి ముందుకు సాగుతోంది. వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తున్న ఈ సంస్థలో కార్మికుల వేతన సవరణ మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. 11వ జాతీయ బొగ్గు వేతన ఒప్పందం గడువు జూన్ 30తో ముగియగా, జూలై 1 నుంచి అమల్లోకి రావాల్సిన 12వ వేతన ఒప్పందంపై నవంబర్ వచ్చినా స్పష్టత లేకపోవడం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోంది. కొత్త వేతన ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అవసరమైన 12వ జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ కోల్ ఇండస్ట్రీ (జేబీసీసీఐ–12) ఏర్పాటులో జాప్యం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కమిటీ ఏర్పాటుకే నెలల తరబడి సమయం పడితే వేతన సవరణ ఎప్పుడు పూర్తవుతుందని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. 2021 జూలై 1 నుంచి 2026 జూన్ 30 వరకు 11వ జాతీయ బొగ్గు వేతన ఒప్పందం అమల్లో ఉంది. తదుపరి ఒప్పందం కోసం చర్చలు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ కమిటీ ఏర్పాటుపై అధికారిక స్పష్టత లేదని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 3న జరిగిన కోల్ ఇండియా ఉన్నతస్థాయి సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో జేబీసీసీఐ–12 ఏర్పాటుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అనుమతి కోరుతామని యాజమాన్యం హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఆ ప్రక్రియ పురోగతిపై స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో కార్మికులు ఎదురుచూస్తున్నారు. కొత్త ఒప్పందం ఖరారయ్యే వరకు 40 శాతం మధ్యంతర ఉపశమనం చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వేతన సవరణ కోసం కార్మిక సంఘాలు ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేపట్టాయి. జూలై 1న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట జాతీయ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆగస్టులోనూ వివిధ ప్రాంతాల్లో నిరసనలకు పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సెప్టెంబర్‌లో యాజమాన్యం ఇచ్చిన హామీ నేపథ్యంలో రాంచీలో నిర్వహించాల్సిన సంయుక్త కార్మిక సంఘాల సమావేశాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. అయితే హామీల అమలుపై నిరంతర ఒత్తిడి కొనసాగించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం కార్మిక వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు సింగరేణిలో సుమారు 1,800 మంది ఎగ్జిక్యూటివ్ అధికారులకు ఈ–1 నుంచి ఈ–7 గ్రేడ్లలో కోల్ ఇండియా తరహా వేతన సవరణకు అక్టోబర్ 19న నిర్ణయం వెలువడినట్లు సమాచారం. ఈ ప్రయోజనాలు సెప్టెంబర్ 25 నుంచి వర్తించేలా ప్రకటించగా, నాన్ ఎగ్జిక్యూటివ్ కార్మికుల వేతన ఒప్పందంపై మాత్రం స్పష్టత లేకపోవడం చర్చనీయాంశమైంది. అధికారుల ప్రయోజనాలను వ్యతిరేకించడం తమ ఉద్దేశం కాదని, కార్మికుల వేతన సవరణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కార్మిక వర్గాలు కోరుతున్నాయి. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నవంబర్ 18న మంచిర్యాలలో జరిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశంలో కనీస బొగ్గు పెన్షన్‌ను నెలకు రూ.15 వేలకు పెంచాలని, కరువు భత్యంతో కలిపి పెన్షన్‌లో 50 శాతం పెంపు కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.25 లక్షల వరకు వైద్య సదుపాయం, అర్హులకు రూ.20 లక్షల గ్రాట్యుటీ, ఏరియా ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం, ఇంటి స్థలాలు, వడ్డీలేని రుణాలు అందించాలని కోరారు. ఈ సమస్యలను జాతీయ కార్మిక సంఘాలు తమ డిమాండ్లలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అయితే పెన్షన్, వైద్య ప్రయోజనాలకు ప్రత్యేక విధానపరమైన నిర్ణయాలు అవసరమని కార్మిక వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఇదిలా ఉండగా, 12వ వేజ్ బోర్డు ఏర్పాటు, 40 శాతం మధ్యంతర ఉపశమనం, పెండింగ్ బకాయిలు, పదోన్నతులు, ఉద్యోగ నియామకాలు, ఇంటి స్థలాలు తదితర సమస్యలపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిసెంబర్‌లో సింగరేణిలోని 11 కార్యాచరణ ప్రాంతాల్లో పరిరక్షణ యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. గుర్తింపు పొందిన కార్మిక సంఘాల పనితీరుపైనా ఆ సంఘం నాయకులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు ఉత్పత్తికి కార్మికుల శ్రమ ఎంత అవసరమో, వారి ఆర్థిక భద్రతకు సకాలంలో వేతన సవరణ కూడా అంతే అవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జేబీసీసీఐ–12 ఏర్పాటు, చర్చల ప్రారంభం, మధ్యంతర ఉపశమనం, కొత్త ఒప్పందం అమలుకు సంబంధించి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా యాజమాన్యం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కార్మికులు కోరుతున్నారు. గనుల్లో చెమటోడ్చే కార్మికుల నిరీక్షణకు ఎప్పుడు తెరపడుతుందన్న ప్రశ్నకు సమాధానం కోసం సింగరేణి కార్మిక కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.



బీజేపీ అసమర్థత వల్లే 12వ వేజ్ బోర్డులో జాప్యం

సింగరేణి బొగ్గు గని కార్మికుల వేతన సవరణ 12వ వేజ్ బోర్డు అమలులో జరుగుతున్న జాప్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణం. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని వేజ్ బోర్డు ప్రక్రియను అడ్డుకుంటున్నారు. కార్మికులకు న్యాయంగా అందాల్సిన వేతన సవరణ ప్రయోజనాలను ఆలస్యం చేయడం ఎంతవరకు సమంజస? 11వ వేజ్ బోర్డు మ–ిగిసింది.. 12వ బోర్డు ఎప్పుడు? 2026 జూన్ 30తో 11వ వేతన ఒప్పంద కాలపరిమితి ముగిసింది జూలై 1 నుంచి 12వ వేజ్ బోర్డు అమల్లోకి రావాల్సి ఉంది. అయితే కమిటీ ఏర్పాటు, చర్చల ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు వేతన ఒప్పందం విషయంలో ఎందుకీ జాప్యం? కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి!

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్ బోర్డు సభ్యుడు రియాజ్ అహ్మద్





అవకాశం ఉంది..

కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఉద్యోగి కేవలం పార్ట్ టైమ్ మాత్రమే.. నోటిఫికేషన్లో నెట్, స్లెట్, జిఆర్ఎఫ్ ఉండాలని నిబంధనలు ఉన్నా, యూజీసీలో ఉన్న కొన్ని నిబంధనల ప్రకారం తీసుకోవడం జరిగింది. కేవలం చెప్పిన తరగతులకు మాత్రమే వేతనం చెల్లించడం జరుగుతుంది. నెట్, స్లెట్, జిఆర్ఎఫ్ లేకున్నా ఒక పోస్ట్ కి ఒకే వ్యక్తి రావడంతో, యూజీసీ నిబంధనల ప్రకారం తీసుకోవచ్చు.

- ఆచార్య పెద్దపల్లి సతీష్ కుమార్,
రిజిస్ట్రార్, శాతవాహన యూనివర్సిటీ

అర్హతలు లేకున్నా అవకాశం?

ఫ్యాకల్టీల నియామకంపై అనుమానాలు

అమలవని యూజీసీ నిబంధనలు?

ఉద్యమ కెరటం, కరీంనగర్ క్రైం (ఆర్కే): కరీంనగర్ లోని శాతవాహన యూనివర్సిటీలో అధ్యాపకుల అర్హతలపై మొదలైన చర్చ ఆసక్తికరంగా మారుతోంది. శాతవాహన యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగానికి చెందిన పార్ట్‌టైమ్ అధ్యాపకుల విద్యార్హతల వివరాలలో ఒకరిద్దరి వివరాలలో నెట్, సెట్, పిహెచ్ డి ప్రస్తావన లేకపోవడం గమనార్హం. విశ్వ విద్యాలయాల్లో అధ్యాపక నియామకాలకు నిర్దిష్ట అర్హతలు, ప్రమాణాలు ఉన్న నేపథ్యంలో వారి నియామకం యూజీసీ కి చెందిన ఏ నిబంధనల ప్రకారం జరిగిందన్న అంశం పలు అనుమానాలకు తావిస్తోంది.

యూజీసీ నిబంధనలు లేని నియామకాలు..?

యూనివర్సిటీలో బోధనా బాధ్యతలు నిర్వహిస్తున్న అధ్యాపకుల నియామకాలకు సంబంధించి అర్హతలు, ఎంపిక విధానం, నియామక ఉత్తర్వులు వంటి వివరాలు పారదర్శకంగా ఉండాల్సి ఉంటుంది. అయితే కెమిస్ట్రీ విభాగానికి చెందిన పోస్టులకు అర్హత లేని వారిని నియమించారనీ, వారి నియామకం సమయంలో వర్తించిన నిబంధనలు ఏమిటనే ప్రశ్నలు విద్యార్థుల్లో ఉత్పన్నమవుతున్నాయి. నెట్, సెట్, పిహెచ్డి అవసరం లేని ప్రత్యేక నిబంధనల కింద సదరు నియామకం జరిగిందా.. అలా జరిగితే ఎంపిక కమిటీ నిర్ణయం ఏమిటనే అంశాలు తెరపైకి వస్తున్నాయి. యూజీసీ నిర్దేశించిన అర్హతలు యూనివర్సిటీల్లో అధ్యాపక నియామకాలకు కీలకమైనవి కాగా శాతవాహన యూనివర్సిటీలో సంబంధిత నియామకాలు ఏ నిబంధనల ప్రకారం చేపట్టారు? ఆ నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థుల అర్హతలను పరిశీలించారా? అన్న అంశాలను యూనివర్సిటీ ఉన్నతాధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

నాణ్యమైన బోధన అందుతోందా?

ఉన్నత విద్య కోసం యూనివర్సిటీలను ఆశ్రయించే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. అధ్యాపకుల నియామకాల్లో విద్యార్హతలు, బోధనా నైపుణ్యం, సంబంధిత అంశాల్లో పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుండగా, అర్హతలపై సందేహాలు తలెత్తినప్పుడు వాటిని నివృత్తి చేయడం, నియామక ప్రక్రియపై స్పష్టత ఇవ్వడం యూనివర్సిటీ బాధ్యతగా భావించాలి. ఇదే విషయమై సంబంధిత విభాగానికి చెందిన ప్రిన్సిపల్ వివరణ కోరగా అర్హతల విషయం తాను చూడనని, యూనివర్సిటీ ఉన్నతాధికారులు పంపిన అధ్యాపకులకు సంబంధించిన తరగతుల కేటాయింపు విషయం మాత్రమే తాను చూస్తానని వెల్లడించడం గమనార్హం. శాతవాహన



యూనివర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ నిబంధనల మేరకు తీసుకోవచ్చు అని చెప్పడం కొసమెరుపు. ఇప్పటికైనా యూజీసీ తో పాటు యూనివర్సిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అర్హత కలిగిన అధ్యాపకులను నియమించాలని, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంలో ముందుండాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం: UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



ప్రజావాణిని సందర్శించిన
రాష్ట్ర బృందం మేనేజర్ శృతి

ఉద్యమ కెరటం, జైనూర్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజావాణి రాష్ట్ర బృందం మేనేజర్ శృతి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, వాటిలో పేర్కొన్న సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు ఇప్పటివరకు ఎందుకు పరిష్కారం కాలేదని, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అధికారులను ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి ఉన్న అవకాశాలు, చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమస్యల పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని రాష్ట్ర బృందానికి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను పరిశీలిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు.



గంభీరావుపేట మార్కెట్ కమిటీ పగ్గాలు చేపట్టిన మహమ్మద్ హమీద్

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా మహమ్మద్ హమీద్, వైస్ చైర్మన్ గా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టగా మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వేశాల వెంకటి కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సీనియర్ నాయకులు పర్శ హన్మాండ్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొని మహమ్మద్ హమీద్‌కు అభినందనలు తెలిపారు. నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన ఆధ్వర్యంలో గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని ఆకాంక్షించారు.

ధర్మాజీపేటలో ఇందిరమ్మ బీమా నమోదు ప్రారంభం



ఉద్యమ కెరటం, దుబ్బాక: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటలో సోమవారం ప్రారంభించారు. 9వ వార్డు కౌన్సిలర్ వనం రమేష్, 8వ వార్డు కౌన్సిలర్ మెరుపుల సాయికుమార్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆసు సులోచన స్వామితో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 7, 8, 9వ వార్డుల కార్యాలయాల్లో లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియను కౌన్సిలర్లు పర్యవేక్షించారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించే 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వ్యక్తికి అనుకోని ఆపద సంభవించినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం రూ. 5లక్షల జీవిత బీమా రక్షణ అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

■ జిల్లా కలెక్టర్ కె.హరిత





ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా దహేగాం మండలం హత్తిని గ్రామానికి చెందిన రంగు సందీప్ సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పట్టా మంజూరు చేయాలని కోరారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న శిబిరాల ద్వారా అర్హులైన ప్రతిఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో నమోదు చేసుకొని రూ.5లక్షల బీమా ప్రయోజనాన్ని పొందాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు బాధ్యతగా కృషి చేయాలి



జిల్లా కలెక్టర్ కె.హరిత

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బాల్య వివాహాల ముక్త్ భారత్ వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. చిన్న వయసులోనే వివాహాలు జరగడంతో బాలికలు అనేక సామాజిక, ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని బాలికలకు, 21 సంవత్సరాలు నిండని బాలురకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల నిషేధ చట్టం–2006 ప్రకారం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వరూప, బాలల సంరక్షణ అధికారి మహేష్, ఎయిడ్స్ స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త సంతోష్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట టిడబ్ల్యూజేఎఫ్ ధర్నా



ఉద్యమ కెరటం, ఖమ్మం: అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా చౌక్ నుంచి జర్నలిస్టులు భారీ ప్రదర్శన చేపట్టి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ డీపీఆర్వో ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తూ జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేయాలని, ఎలాంటి వివక్షకు తావులేకుండా నిబంధనల ప్రకారం అర్హులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్ఓకు అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే త్వరలోనే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. సోమవారం తిర్యాణి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అదనపు గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఉపాధ్యాయులు సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, వంద శాతం హాజరు సాధించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు శిబిరాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. లింగాపూర్, తిర్యాణి మండలాల్లో అమలవుతున్న టీజీఐఎల్‌పీ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారి జీవనోపాధి మెరుగుపడేలా అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నగేష్, మండల విద్యాధికారి అంజయ్య, డీపీఎం యశోద, ఏపీఎంలు శ్రీనివాస్, సూర్యకాంత్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



భారత్ చేతిలో థాయ్‌లాండ్ చిత్తు

భోపాల్: మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్లో భారత్ విజయాల హ్యాట్రిక్ కొట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 7-0తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. దీపిక హ్యాట్రిక్‌తో జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించింది. నాలుగో నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌ను నవ్‌నీత్ కౌర్ గోల్‌గా మలిచి భారత్‌ను ఆధిక్యంలో నిలిపింది. ఆపై దీపిక (10, 11వ నిమిషాలు) స్వల్ప వ్యవధిలో రెండుసార్లు బంతిని లక్ష్యానికి చేర్చడంతో స్కోరు 3-0గా మారింది. తర్వాత భారత్ జోరు మరింత పెరిగింది. మరో మూడు గోల్స్ ఖాతాలో చేరాయి. ఈ గోల్స్‌ను ముంతాజ్ ఖాన్ (28వ), సునెలితా టోపో (32వ), దీపిక (56వ) చేశారు. 56వ నిమిషంలోనే నవ్‌నీత్ కౌర్ పెనాల్టీ స్ట్రోక్‌ను సద్వినియోగం చేయడంతో భారత్ 7-0తో నిలిచింది. ఆ తర్వాత థాయ్‌లాండ్‌ను ఒక్క గోల్ కూడా కొట్టనీయకుండా మ్యాచ్‌ను ముగించింది. ఈ టోర్నీలో ఇప్పటికే మలేసియా, దక్షిణ కొరియాపై భారత్ గెలిచింది.

భారత్ టెస్టు డ్రా!

వెల్లింగ్టన్ తొలి టెస్టులో న్యూజిలాండ్ పోరాటపటిమ

720 పరుగులు చేసినా గెలుపు దక్కలేదు..

- రెండో ఇన్నింగ్స్‌లో 239/5తో ఓటమిని తప్పించుకున్న కివీస్
- ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించిన టీమిండియా
- భారత బౌలర్ల ఖాతాలో 42 మెయిడిన్ ఓవర్లు
- 43 ఓవర్లపాటు క్రీజులో పాతుకుపోయిన మిచెల్, ఫిలిప్స్



వెల్లింగ్టన్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారీ స్కోరు సాధించినప్పటికీ భారత్‌కు విజయం దక్కలేదు. వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులు చేయగా, భారత్ 720/9 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో 352 పరుగుల ఆధిక్యం సాధించిన టీమిండియా విజయంపై ఆశలు పెట్టుకుంది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ బ్యాటర్లు పట్టుదలగా ఆడి 239/5 స్కోరుతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించినప్పటికీ చివరి వరకు వికెట్లు పడగొట్టలేకపోయారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఏకంగా ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించడం విశేషం. టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియా ఒక ఇన్నింగ్స్‌లో ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించడం ఇది 28వసారి. గత ఆగస్టులో కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరిగిన టెస్టులోనూ భారత్ ఎనిమిది మంది బౌలర్లతో బౌలింగ్ చేయించింది. వరుసగా రెండు టెస్టుల్లో ఈ విధంగా బౌలర్లను ఉపయోగించడం భారత క్రికెట్ చరిత్రలో అరుదైన సందర్భంగా నిలిచింది. గతంలో 1963-64 ఇంగ్లండ్ సిరీస్‌తోపాటు 1952--53లో పాకిస్థాన్, వెస్టిండీస్‌లతో జరిగిన వరుస టెస్టుల్లో ఇలాంటి పరిస్థితి నమోదైంది. మరోవైపు భారత బౌలర్లు న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 42 మెయిడిన్ ఓవర్లు వేసి ప్రత్యేక గుర్తింపు సాధించారు. 2025-27 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చక్రంలో ఒక జట్టు ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక మెయిడిన్ ఓవర్లుగా ఇవి నిలిచాయి. చివరిసారిగా భారత్ ఒక ఇన్నింగ్స్‌లో 40కిపైగా మెయిడిన్ ఓవర్లు వేసింది 2015లో దక్షిణాఫ్రికాతో ఢిల్లీలో జరిగిన టెస్టులోనే. ఆ మ్యాచ్‌లో భారత బౌలర్లు ఏకంగా 89 మెయిడిన్ ఓవర్లు వేసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. న్యూజిలాండ్ బ్యాటర్లు డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ భారత విజయావకాశాలను దెబ్బతీశారు. ఆరో వికెట్‌కు వీరిద్దరూ 43 ఓవర్లపాటు క్రీజులో నిలిచి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఈ శతాబ్దంలో న్యూజిలాండ్ తరఫున ఆరో వికెట్ లేదా అంతకంటే దిగువ వికెట్‌కు నమోదైన సుదీర్ఘ భాగస్వామ్యాల్లో ఇది రెండో స్థానంలో నిలిచింది. 2014లో ఇదే మైదానంలో భారత్‌పై బ్రెండన్ మెకల్లమ్, బీజే వాట్లింగ్ 123 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి 352 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రికార్డు ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. ఇక నవంబర్ నెలలో నాలుగు టెస్టులు డ్రాగా ముగియడం మరో విశేషం. బంగ్లాదేశ్--వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్--జింబాబ్వే, పాకిస్థాన్--శ్రీలంక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లతోపాటు భారత్--న్యూజిలాండ్ తొలి టెస్టు కూడా డ్రాగా ముగిసింది. 2011 తర్వాత ఒకే నెలలో నాలుగు టెస్టులు డ్రాగా ముగియడం ఇది మూడోసారి. గతంలో 2013 మార్చి, 2022 మార్చి నెలల్లో ఇలాంటి ఫలితాలు నమోదయ్యాయి. భారీ ఆధిక్యం సాధించినా ప్రత్యర్థి బ్యాటర్ల పట్టుదల ముందు భారత్ విజయం అందుకోలేకపోవడం ఈ మ్యాచ్‌లో ప్రధాన విశేషంగా నిలిచింది.

మా బ్యాటర్లు అద్భుతం



ఓడిపోయే మ్యాచ్‌ను డ్రా చేశారు

హెన్రీ నికోల్స్ ఆనందం!

వెల్లింగ్టన్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): భారత్‌తో వెల్లింగ్టన్ వేదికగా జరిగిన తొలి టెస్టులో న్యూజిలాండ్ అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో అజేయంగా 175 పరుగులు చేసిన హెన్రీ నికోల్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన నికోల్స్.. ఐదు రోజుల ఆటను వెనక్కి తిరిగి చూసుకుంటే పిచ్ పరిస్థితులు మారుతూ వచ్చాయని, రెండు జట్లు తమ శక్తిమేరకు పోరాడాయని తెలిపారు. ముఖ్యంగా చివరి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై తమ బ్యాటర్లు చూపిన పట్టుదల ప్రశంసనీయమని పేర్కొన్నారు. డారిల్ మిచెల్ (49: 186 బంతుల్లో), గ్లెన్ ఫిలిప్స్ (26: 126 బంతుల్లో) 43 ఓవర్ల పాటు క్రీజ్‌లో పాతుకుపోవడంతో టీమిండియాకు విజయం దక్కలేదని గుర్తు చేశారు. తొలి ఇన్నింగ్స్ నుంచి మ్యాచ్ ముగిసే సమయానికి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, పిచ్‌లో మార్పులు వచ్చినప్పటికీ బ్యాటర్లకు కొన్ని సవాళ్లు ఎదురయ్యాయని నికోల్స్ వివరించారు. అలాంటి పరిస్థితుల్లోనూ వాటిని అధిగమిస్తూ ఆడటం జట్టుకు సంతృప్తినిచ్చిందని, ఒక దశలో కష్టాల్లో ఉన్న జట్టు చివరకు మ్యాచ్‌ను డ్రాగా ముగించుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ అద్భుతంగా ఆడి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారని, ఆ ఇద్దరి వల్లే మ్యాచ్‌ను డ్రాగా ముగించుకోగలిగామని, జట్టులోని ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించారని నికోల్స్ పేర్కొన్నారు.

మరికొంత సేపు ఆడితే బాగుండేది..

క్రైస్ట్‌చర్చ్ పోరుపై ఆసక్తి:

టెస్టులో తొలి నాలుగు రోజుల పాటు ఎక్కువ సమయం మైదానంలోనే గడిపిన నికోల్స్‌ను శారీరక పరిస్థితి గురించి ప్రశ్నించగా.. తాను బాగానే ఉన్నానని చెప్పారు. ఐదు రోజుల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం వల్ల ఆటగాళ్లంతా అలసిపోయారని, చివరి రోజు మైదానంలోకి దిగకుండా ఉండటం తనకు కొంత వింతగా అనిపించిందని తెలిపారు. శరీరం నొప్పులతో ఉన్నప్పటికీ మరికొంత సేపు మైదానంలో ఉండి ఆడితే బాగుండేదని, ఈ మ్యాచ్ నిజంగా ఓపికకు పరీక్షగా నిలిచిందని పేర్కొన్నారు. బేసిన్ రిజర్వ్ మైదానంలో తనకు మంచి రికార్డు ఉందని, ఈ మైదానంపై తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, గతంలో మంచి ప్రదర్శనలు చేసిన మైదానానికి తిరిగి రావడం ఎప్పుడూ సంతోషాన్నిస్తుందని హెన్రీ నికోల్స్ అన్నారు. తొలి రోజు పిచ్ గతంలో మాదిరిగానే ఉంటుందని భావించామని, అయితే ఆట సాగుతున్న కొద్దీ పరిస్థితులు మారిపోయాయని, అయినప్పటికీ సవాళ్లను ఎదుర్కొంటూ జట్టు తగిన పరిష్కారాలు కనుగొనడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇక తదుపరి క్రైస్ట్‌చర్చ్ టెస్టు గురించి మాట్లాడుతూ.. అక్కడ సాధారణంగా పిచ్‌పై కొంత గడ్డి ఉండటంతో పాటు బౌలర్లకు వేగం, బౌన్స్ లభిస్తాయని, ఈసారి కూడా అలాంటి పిచ్ ఉంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి టెస్టు డ్రాగా ముగియడంతో చివరి మ్యాచ్ మరింత ఆసక్తికరంగా మారిందని, క్రైస్ట్‌చర్చ్‌లో ఉత్కంఠభరిత పోరు ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ టెస్టులో న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 368 పరుగులు చేయగా, భారత్ 720/9 వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 239/5 స్కోరు చేయడంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, నికోల్స్ తొలి ఇన్నింగ్స్‌లో 175లి పరుగులతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో కీలక 31 పరుగులు సాధించి జట్టు తరఫున కీలక పాత్ర పోషించారు.



భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో ఉద్రిక్తత

హర్షిత్ రాణాపై స్లెడ్జింగ్..

పాక్ ఆటగాళ్లతో తిలక్ వర్మ వాగ్వాదం!

దోహా, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వివాదానికి దారితీసింది. భారత బౌలర్ హర్షిత్ రాణాను పాకిస్థాన్ ఆటగాళ్లు కవ్వించడంతో మైదానంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సహచర ఆటగాడి పట్ల ప్రత్యర్థుల ప్రవర్తనపై భారత కెప్టెన్ తిలక్ వర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా అంపైర్లు జోక్యం చేసుకుని ఆటగాళ్లను శాంతింపజేశారు. భారత ఇన్నింగ్స్ 45వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. మహమ్మద్ ఇమ్రాన్ రంధావా వేసిన రెండో బంతికి హర్షిత్ రాణా ఔటయ్యాడు. అప్పటికే భారత్ ఓటమి అంచున ఉండగా, పాకిస్థాన్ విజయానికి మరో వికెట్ మాత్రమే అవసరమైంది. హర్షిత్ పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో సూఫియాన్ ముకీమ్‌తోపాటు పలువురు పాక్ ఆటగాళ్లు అతడిని కవ్వించినట్లు కనిపించింది. దీంతో మరో ఎండ్‌లో ఉన్న తిలక్ వర్మ వెంటనే స్పందించి ప్రత్యర్థి ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు. అంపైర్లు మధ్యలోకి వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అయితే ఈ వివాదానికి ముందు కూడా ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ బ్యాటింగ్ సమయంలో హర్షిత్ రాణా పలుమార్లు ప్రత్యర్థి ఆటగాళ్లను కవ్వించినట్లు సమాచారం. వికెట్లు తీసిన సందర్భాల్లోనూ వాగ్వాదం జరగడంతో అంపైర్లు జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హర్షిత్ ఔటైన తర్వాత పాక్ ఆటగాళ్లు అదే తరహాలో స్పందించినట్లు కనిపిస్తోంది. అయితే ఆటగాళ్లు అసభ్య పదజాలం ఉపయోగించారనే అంశంపై స్పష్టత లేదు. ఈ ఘటనపై మ్యాచ్ రిఫరీ ఏమైనా చర్యలు తీసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇక మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ ఏ జట్టు 49.2 ఓవర్లలో 313 పరుగులకు ఆలౌటైంది. హసన్ నవాజ్ 79, మాజ్ సదాఖత్ 59, ఫర్హాన్ యూసఫ్ 56 పరుగులతో రాణించారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, సూర్యాన్ష్ షెడ్గే, విప్రజ్ నిగమ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. 314 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 49.1 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. తిలక్ వర్మ సెంచరీతో పోరాడగా, అభిషేక్ శర్మ 70, షాబాజ్ అహ్మద్ 56 పరుగులు సాధించారు. అయినప్పటికీ భారత్‌కు ఓటమి తప్పలేదు. పాకిస్థాన్ ఏ జట్టు 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ ఫలితం కంటే మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య జరిగిన వాగ్వాదమే ఎక్కువ చర్చకు దారితీసింది.



హైదరాబాద్ మరో విజయం

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో హైదరాబాద్ రెండో విజయం అందుకుంది. బంతితో కెప్టెన్ సీవీ మిలింద్ (4/25), రక్షణ్ రెడ్డి (3/24), బ్యాట్‌తో కె. హిమతేజ (40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 77 సత్తా చాటడంతో ఆదివారం జరిగిన గ్రూప్-డీ మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఉత్తరాఖండ్‌పై విజయం సాదించింది. ఉత్తరాఖండ్ ఇచ్చిన 147 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. అభిరథ్ (22) కూడా రాణించాడు. తొలుత ఉత్తరాఖండ్ 19.2 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. యువరాజ్ చౌదరి (59), అనీశ్ (43) రాణించారు. మిలింద్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. మంగళవారం జరిగే తమ తదుపరి మ్యాచ్ గుజరాత్‌తో హైదరాబాద్ తలపడనుంది.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



మమితా బైజు వీడియో కలకలం
ఏఐతో ఇంత దారుణమా!

మమితా బైజు, ప్రదీప్ రంగనాథన్ పేరుతో అభ్యంతరకర వీడియో ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): కృత్రిమ మేధ సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ దాని దుర్వినియోగం సినీ ప్రముఖులకు తీవ్ర సమస్యగా మారుతోంది. ఇప్పటికే పలువురు నటీమణులు డీప్‌ఫేక్ వీడియోలతో ఇబ్బందులు ఎదుర్కోగా, తాజాగా మలయాళ నటి మమితా బైజు, నటుడు ప్రదీప్ రంగనాథన్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న అభ్యంతరకర వీడియో వివాదానికి దారితీసింది. వీరిద్దరూ కలిసి నటించిన 'డ్యూడ్' సినిమాలోని ఓ భావోద్వేగ సన్నివేశాన్ని కృత్రిమ మేధ సాయంతో అసభ్యకరంగా మార్చి ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నటీనటుల అనుమతి లేకుండా వారి చిత్రాలను ఇలా దుర్వినియోగం చేయడంపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సినిమాలోని సాధారణ సన్నివేశాన్ని అసభ్యకరంగా చిత్రీకరించేలా మార్ఫింగ్ చేశారని సామాజిక మాధ్యమాల్లో పలువురు ఆరోపిస్తున్నారు. వినోదం పేరుతో వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించే కృత్రిమ వీడియోలను సృష్టించడం అత్యంత అభ్యంతరకరమని విమర్శిస్తున్నారు. ఈ వీడియోను చూసిన ఓ కంటెంట్ సృష్టికర్త తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు వెల్లడించడం కూడా చర్చనీయాంశమైంది. సాంకేతికతను సృజనాత్మకతకు ఉపయోగించాల్సింది పోయి ఇతరుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రచారంలో ఉన్న వీడియో మూలం, దాన్ని రూపొందించిన వ్యక్తుల వివరాలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. గతంలోనూ రష్మిక మందన్నా, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ వంటి పలువురు సినీ తారల పేరుతో డీప్‌ఫేక్, మార్ఫింగ్ వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. ఇప్పుడు మమితా బైజు, ప్రదీప్ రంగనాథన్ పేరుతో మరో వివాదం తెరపైకి రావడంతో సినీ పరిశ్రమలో ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం సెలబ్రిటీలే కాకుండా సామాన్య మహిళలు, యువతులు కూడా ఇలాంటి సాంకేతిక దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. అభ్యంతరకర వీడియోలను ఇతరులకు పంపకుండా సంబంధిత సామాజిక మాధ్యమ వేదికలకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

నాకు పెళ్లి చేసుకోవాలని ఉంది.. కానీ,



వ్యక్తిగత జీవితంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉండేందుకు ఇష్టపడతానని ప్రముఖ నటి నిత్యా మేనన్ అన్నారు. ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తి జీవితానికి సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు. 'నేను ఎల్లవేళలా ఒంటరిగా ప్రయాణం చేసేందుకు ఇష్ట పడతాను. నేను వివాహ బంధానికి వ్యతిరేకం అంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ, అందులో ఏమాత్రం నిజం లేదు. నాకు కూడా వివాహం చేసుకోవాలని ఉంది. కానీ, నాకు సరైన వ్యక్తి తారస పడాలి. అదేసమయంలో పెళ్ళి చేసుకోవాలని ఆరాటపడటం లేదు. నిజాయితీతో కూడిన బంధాన్ని కోరుకుంటున్నాను. ఆ బందం అలాంటిది కాకపోతే నేను పెళ్ళికి దూరంగా ఉంటాను. ఒక వ్యక్తి జీవితంలో పవిత్రంగా ఉండాలి. అహంకారంతో నడుచుకుంటే అలాంటి బంధం సరైనది కాదు. నా జీవితంలో నా ఎంపికలు భిన్నంగా ఉంటాయి. పెద్దలు కుదర్చిన వివాహాల్లో చాలా జంటలు ఎంతో సంతోషంగా, అన్యోన్యంగా ఉంటున్నారు. మరికొందరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని సమయాల్లో మనమే ఎంపిక చేసుకున్న వ్యక్తికి విడాకులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇందులో ఏది తప్పు, ఏది కరెక్ట్ అనేది మనం చెప్పలేం' అని వేదాంత ధోరణిలో నిత్యామేనన్ పేర్కొన్నారు.

రూప కొడువాయూర్
స్టన్నింగ్ లుక్స్
సోషల్ మీడియాలో పిక్స్ వైరల్!

హైదరాబాద్, నవంబర్ 23 (ఉద్యమ కెరటం): సహజసిద్ధమైన నటన, ఆకట్టుకునే హావభావాలతో గుర్తింపు పొందిన నటి రూప కొడువాయూర్, సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్‌లు, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఆమె పంచుకున్న స్టన్నింగ్ పిక్స్ నెట్టింట వేగంగా వైరల్ అవుతున్నాయి. ఆకర్షణీయమైన అవుట్‌ఫిట్, స్టైలిష్ లుక్స్‌తో రూప కొడువాయూర్ దిగిన ఈ ఫొటోలకు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ ఫొటోలపై నెటిజన్లు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. సినిమా ప్రాజెక్టులతో పాటు సోషల్ మీడియాలోనూ చురుకుగా ఉంటూ ఫాలోవర్లను అలరిస్తున్నారు.





ఆయనే ప్రత్యేకతను గుర్తించారు



'భోగి' సినిమాలో మందారం పాత్రతో సరికొత్త అవతారంలో కనిపించబోతున్న డింపుల్ హయాతీ. ఇప్పటివరకు గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా చూసిన ప్రేక్షకులు ఈసారి తనలోని కొత్త కోణాన్ని చూస్తారని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'ఇప్పటిదాకా నన్ను గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా మాత్రమే తెరపై చూశారు. ఇప్పుడు నాలోని కొత్త యాంగిల్ బయటకు రాబోతుంది. మందారం పాత్రతో కొత్త డింపుల్‌ను చూస్తారు. ఈ క్రెడిట్ అంతా దర్శకుడికే దక్కుతుంది" అని డింపుల్ హయాతీ అన్నారు. శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న 'భోగి' చిత్రంలో డింపుల్ హయాతీ మందారం పాత్రలో కనిపించనున్నారు. కె.కె. రాధామోహన్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహించారు. ఈ నెల 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డింపుల్ మాట్లాడుతూ 'తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని, నలుగురిలో ప్రత్యేకంగా నిలవాలని ప్రతి ఆర్టిస్ట్ కలలు కంటుంటారు. మన దగ్గరకు వచ్చిన అవకాశాల్లో ఏది చేయగలమో, ఏది మంచిదో అదే ఎంచుకుంటాం. అలా వచ్చిన అవకాశమే 'భోగి' చిత్రంలోని మందారం పాత్ర. రాధామోహన్ నిర్మించే మరో సినిమాలోని పాత్ర కోసం ఆయన్ను కలిశాను. ఆ సందర్భంలో సంపత్ నంది కలిసి ఈ కథ చెప్పారు. వేరే సినిమా చేయాల్సిన నేను మందారం పాత్ర చేస్తానని అడిగాను. అలా నాకు ఈ అవకాశం వచ్చింది. పాత్ర గురించి వినగానే ఇది నేనే చేయాలని నిర్ణయించుకున్నాను. నా కెరీర్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చే పాత్ర ఇది. ఇప్పటిదాకా నన్ను గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా చూశారు. ఇవన్నీ పక్కనపెట్టి తొలిసారిగా ఓ దర్శకుడు నా కళ్లపై దృష్టిపెట్టి ఈ పాత్ర ఇచ్చారు. నాలోని మరో యాంగిల్‌ను ఆయన గుర్తించారు. మందారం పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో తెరపై చూస్తేనే తెలుస్తుంది. ఈ సినిమా నాకు ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్‌ను క్రియేట్ చేస్తుంది. ఈ సినిమాలో మాటలు, తెలంగాణ యాస అన్నీ అద్భుతంగా కుదిరాయి. అయితే, ఈ సినిమాలో నాకు డాన్స్ చేసే అవకాశం దొరకలేదు. శర్వానంద్, అనుపమతో కలిసి పనిచేయడం బాగుంది. కచ్చితంగా ఈ సినిమా నా కెరీర్‌లో చాలా ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ క్రెడిట్ అంతా దర్శకుడికే చెందుతుంది' అని అన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

ఎంభూరాలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం



ఉద్యమ కెరటం, డొంగ్లీ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని మండలంలోని ఎంభూరా గ్రామంలో సర్పంచ్ యూనుస్ పటేల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకం ముఖ్య ఉద్దేశాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ.5లక్షల జీవిత బీమా కవరేజీ లభిస్తుందని పేర్కొన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న వ్యక్తికి అనుకోని ప్రమాదంలో మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా బీమా రక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫహీమ్ పటేల్, గ్రామ కార్యదర్శి షోయెబ్, కారోబారి అజ్మీర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు



ఉద్యమ కెరటం, నేరడిగొండ: నేరడిగొండ మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సామాజిక కార్యకర్తలు సాబ్లే సంతోష్ సింగ్, బొంతుకుల శ్రీను జిల్లా కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో వివిధ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. మండలంలోని తహశీల్దార్, ఎంపీడీఓ, ఐకేపీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా లేవని పేర్కొన్నారు. అలాగే సమీకృత ప్రభుత్వ కార్యాలయ సముదాయం నిర్మించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పశు వైద్యశాల స్థానంలో నూతన భవనం నిర్మించి, అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. అదేవిదంగా జాతీయ రహదారిపై కుంటాల రోడ్డు నుంచి ధాబా హోటళ్ల వరకు సర్వీస్ రోడ్లు నిర్మించాలని, డ్రైనేజీ మరమ్మతులు, వీధి దీపాలు, పశువుల నివారణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. భవిష్యత్తులో హైవే విస్తరణ చేపడితే నేరడిగొండలో ఫ్లైఓవర్ నిర్మించాలని, తద్వారా స్థానిక వ్యాపారాలకు మేలు కలిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేయించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

లబ్ధిదారులకు చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ



ఉద్యమ కెరటం, తాండూర్: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ పత్రాలను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సార్ల తిరుపతి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను అందజేశారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కామిని శ్రీనివాస్, ఉప సర్పంచ్ విక్రమ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు షేక్ మోమిన్ అలీ, వార్డు సభ్యులు మహంకాళి కృష్ణమూర్తి, దుర్గం దామయ్య, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ రామ్ ప్రసాద్, గ్రామ పంచాయతీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తుపల్లి విద్యార్థి సత్తా

- ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ లో మట్టా స్వామి గౌడ్ ప్రతిభ



ఉద్యమ కెరటం, సత్తుపల్లి: ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ 2026లో సత్తుపల్లి నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థి మట్టా స్వామి గౌడ్ తన కరాటే ప్రతిభతో సత్తా చాటి పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. ఆదివారం ఖమ్మం ఉద్యోగర్ షాదిఖానాలో జరిగిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రత్యేక గుర్తింపు పొందిన స్వామి గౌడ్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం రాంకీ, ఆర్ఐ క్రాంతి విద్యార్థి స్వామి గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల పట్ల అతనికున్న ఆసక్తి, నిరంతర సాధన, పట్టుదలను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రామ్మూర్తి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం పాఠశాల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ విజయం సాధించడంలో విద్యార్థి కృషితో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం కూడా ఎంతో ఉందని తెలిపారు. విద్యతో పాటు క్రీడారంగంలోనూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించడమే తమ పాఠశాల లక్ష్యమని అన్నారు.

మంత్రతంత్రాల పేరుతో డబ్బులు రెట్టింపు చేస్తామంటూ మోసం

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- రూ.3.74 లక్షల నగదు, మూడు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం





ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: మంత్రతంత్రాలు, పూజల పేరుతో డబ్బులు రెట్టింపు చేస్తామని నమ్మించి అమాయక ప్రజలను మోసం చేస్తున్న ముఠాను ఇచ్చోడ పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3.74 లక్షల నగదు, మూడు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 19న ఇచ్చోడ మండలం ఎన్హెచ్-44 సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద బాధితుడు తోకల రాజును పూజల ద్వారా డబ్బులు రెట్టింపు చేస్తామని నమ్మించి రూ.3లక్షలు లాక్కొని నిందితులు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టి ముఠాను పట్టుకున్నారు. ఈ కేసులో ఇంద్రవెల్లి మండలం గిన్నెర గ్రామానికి చెందిన ఆత్రం పరశురాం, ఇంద్రవెల్లికి చెందిన మండలి బక్కన్న, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన నౌగడే శేఖర్, కెరమెరికి చెందిన మండలి శైలేష్, సిర్పూర్(యు)కు చెందిన షేక్ అలీంలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు గతంలో మంచిర్యాల్, కరీంనగర్, నిజామాబాద్, ఆసిఫాబాద్, కామారెడ్డి, పెద్దపల్లి తదితర జిల్లాల్లోనూ ఇదే తరహా మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఆదిలాబాద్ జిల్లాలో ఇచ్చోడలో ఒకటి, ఉట్నూర్‌లో రెండు, ఇంద్రవెల్లిలో ఐదు కలిపి మొత్తం 8 కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 24 మంది బాధితులను మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. మోసాల ద్వారా వచ్చిన డబ్బులతో కార్లు కొనుగోలు చేయడంతో పాటు ఇంటి నిర్మాణం, జల్సాలకు ఖర్చు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు డబ్బులు రెట్టింపు చేస్తామనే మాయమాటలను నమ్మవద్దని, ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కేసు దర్యాప్తులో ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్, గుడిహత్నూర్ ఎస్ఐ ఎల్.శ్రీకాంత్, ఇచ్చోడ ఎస్ఐ కె.విష్ణు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య తీవ్రతను బట్టి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సంబంధిత సమస్యలతో పాటు ఇతర అంశాలపై తమ దరఖాస్తులను అదనపు కలెక్టర్లకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్ ఆర్ఎస్.చిత్రు, డీఆర్ఓ ప్రవంతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

- కవిత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడి
- బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: బోథ్ నియోజకవర్గంలోని గుడిహత్నూర్ మండలం గూర్జ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. ఆదిలాబాద్‌లోని టీఆర్ఎస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రాథోడ్ బాపురావు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజల కోసం చేపడుతున్న కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గబ్బిలాలపేట్‌లో చెత్త కుప్పలు.. ప్రజల ఆరోగ్యానికి ముప్పు

- సర్వే నం.300లో పేరుకుపోయిన చెత్త.. పట్టించుకోని అధికారులు



పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. పారిశుద్ధ్యంపై ఏది



ఉద్యమ కెరటం, జవహర్ నగర్: జవహర్ నగర్‌లోని గబ్బిలాలపేట్ సర్వే నం.300లో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త కుప్పల చుట్టూ పేద ప్రజలు నివసిస్తుండగా, గాలికి చెత్త కవర్లు ఎగిరి ఇళ్లలోకి చేరుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చనిపోయిన జంతువుల కళేబరాలను సైతం అక్కడ పడేస్తుండటంతో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. గతంలో ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, తాత్కాలిక చర్యలకే అధికారులు పరిమితమయ్యారని ఆరోపిస్తున్నారు. చెత్తను తొలగించిన కొద్ది రోజులకే మళ్లీ అదే ప్రాంతంలో చెత్త పేరుకుపోతుండటంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి ఇంటి పన్నులు, ఇతర పన్నులు వసూలు చేయడంలో అధికారులు చూపుతున్న శ్రద్ధ ప్రజలకు కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని నిలదీస్తున్నారు. ఇప్పటికే జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు, కాలనీల్లోనూ చెత్త సమస్య ఎదురవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు. పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించి, ఆ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని స్థానికులు జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరుతున్నారు. భవిష్యత్తులో అక్కడ చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించి చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ఆరోగ్యంతో ముడిపడిన ఈ సమస్యపై అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని గబ్బిలాలపేట్ వాసులు కోరుతున్నారు.

అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల బీమా భరోసా

- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ సుజాయిత్ ఖాన్



ఉద్యమ కెరటం, కెరమెరి: కెరమెరి గ్రామపంచాయతీలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ సుజాయిత్ ఖాన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ సుజాయిత్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5లక్షల జీవిత బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారు ఈ పథకానికి అర్హులని వివరించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ ఇర్ఫాన్, కారోబారి గడ్డల వెంకన్న, మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్, పెండూర్ శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖుతుబొద్దిన్, వార్డు సభ్యుడు శ్రీకాంత్, గంటేవాడ్ మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం: UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

ఖేలో ఇండియా క్రీడలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 8వ ఖేలో ఇండియా యూత్ క్రీడలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రజలకు క్రీడల ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖేలో ఇండియా సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, ప్రధాన కూడళ్లు, క్రీడా మైదానాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఖేలో ఇండియా క్రీడలకు సంబంధించిన ఫ్లెక్సీలు, కటౌట్లు, సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రచార కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖేలో ఇండియా క్రీడా పోటీలను ప్రజలు ఆసక్తిగా తిలకించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలతో పాటు వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా నుంచి ప్రత్యేక క్రీడా బృందాన్ని పోటీలను తిలకించేందుకు పంపించేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. దీంతో క్రీడాకారులకు ప్రోత్సాహం లభించడంతో పాటు యువతలో క్రీడల పట్ల ఆసక్తి, స్ఫూర్తి మరింత పెరుగుతుందన్నారు. క్రీడా పోటీలు ముగిసే డిసెంబర్ 21వ తేదీ వరకు ప్రతిరోజూ వివిధ ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని



స్పష్టం చేశారు. సంబంధిత క్రీడా పాఠశాలలు, డీబీడీ కాంప్లెక్స్ మైదానం, ఏటీడీపీ పాఠశాల హాళ్లలో అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజయవంతం కావడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, క్రీడల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్.చిత్తు, డీఆర్వో శ్రవంతి, క్రీడా శాఖ అధికారులు దయానంద్, పార్థసారథి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం కలకలం

- **ఐదు ఎకరాల భూ వివాదంపై కొంతకాలంగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు**
- **పురుగుల మందు తాగిన రైతు**

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. భోరజ్ మండలం మాండగడ గ్రామానికి చెందిన దేవన్న అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో అక్కడున్న అధికారులు, ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హత్తిఘాట్ శివారు ప్రాంతంలో రైతు దేవన్నకు చెందిన



ఐదు ఎకరాల భూమిపై కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించి తన భూమి విషయంలో న్యాయం చేయాలని బాధిత రైతు గత కొన్ని రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారుల నుంచి సరైన స్పందన లభించకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ప్రజావాణి కార్యక్రమంలోనే పురుగుల మందు సేవించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనతో వెంటనే స్పందించిన పోలీసులు రైతు దేవన్నను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తూ ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని గ్రామస్తులు తెలిపారు. తమకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, సాగు భూమి సమస్య పరిష్కారం కాకపోవడంతో జీవనోపాధి కష్టంగా మారిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి భూ వివాదాన్ని పరిష్కరించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

జనగాం మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి సిద్ధం

మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఉద్యమ కెరటం, సిద్దిపేట: రూ.154 కోట్లతో నిర్మాణం పూర్తయిన జనగాం మెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్ బ్లాక్ భవనాల ప్రారంభోత్సవానికి వెంటనే ఏర్పాట్లు చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన వైద్య భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, డీఎంఈ వాణి, అకాడమిక్ డీఎం రమాదేవి, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, జనగాం జిల్లాల కలెక్టర్లు చిత్రా మిశ్రా, సత్య చంద్రిక, కె.హైమావతి, సందీప్ కుమార్ ఝా, ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కరీంనగర్ మెడికల్ కాలేజీ, హాస్టల్ భవనాల నిర్మాణ జాప్యంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు గర్ల్స్ హాస్టల్, డిసెంబర్ చివరికి బాయ్స్ హాస్టల్, మార్చి ఆఖరుకు మెడికల్ కాలేజీ భవనాన్ని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. సిద్దిపేట టీచింగ్ హాస్పిటల్ పనులను వేగవంతం చేసి మార్చి చివరి వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, మెడికల్ కాలేజీ, జీజీహెచ్, నర్సింగ్ కాలేజీ, ఆయుష్ ఆసుపత్రులకు మాజీ మంత్రి, దివంగత అనంతుల మదన్‌మోహన్ పేరు పెడుతూ జారీ అయిన ఉత్తర్వుల మేరకు వెంటనే నేమ్ బోర్డులు, రికార్డులు, వెబ్‌సైట్లలో పేరు మార్చాలని కలెక్టర్ హైమావతి, అధికారులకు సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. హుస్నాబాద్ లో రూ.82 కోట్లతో 100 నుంచి 250



పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తున్న ఏరియా హాస్పిటల్ పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఇక్కడ మెడికల్ పీజీ కాలేజీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు గుర్తు చేశారు. తమ పరిధిలోని వైద్య భవనాల పనులపై ప్రతి వారం సమీక్షించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు.

ఖబ్రస్థాన్, ఈద్గా భూమికి వెంటనే హద్దులు ఏర్పాటు చేయాలి

- **కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్‌కు తంజీమ్ మసాజిద్ కమిటీ వినతి**

ఉద్యమ కెరటం, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా మైనారిటీల చిరకాల కోరికైన ఖబ్రస్థాన్, ఈద్గా కోసం కేటాయించిన నాలుగు ఎకరాల భూమికి వెంటనే హద్దులు ఏర్పాటు చేసి, మైనారిటీ కమిటీకి అధికారికంగా అప్పగించాలని తంజీమ్ మసాజిద్ కమిటీ ప్రతినిధులు, మత పెద్దలు, బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, అర్బన్ తహశీల్దార్‌లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు చొరవతో సిద్దిపేట అర్బన్ మండలం గాడిచర్లపల్లి గ్రామ పరిధిలోని సర్వే



నం.244లో మైనారిటీల అవసరాల కోసం నాలుగు ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని గుర్తుచేశారు. భూమి కేటాయించి మూడేళ్లు కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖబ్రస్థాన్, ఈద్గా కోసం ప్రత్యేక స్థలం అందుబాటులో లేక మైనారిటీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు ఇకనైనా జాప్యం చేయకుండా వెంటనే స్పందించి కేటాయించిన నాలుగు ఎకరాల భూమికి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని, అధికారికంగా మైనారిటీ కమిటీకి అప్పగించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తంజీమ్ మసాజిద్ కమిటీ ప్రతినిధులు అక్బర్, నవాబ్, పాషా, జుబేర్, రియాజ్, ఉబైద్, సిద్దిపేట నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు లయీక్, యువజన అధ్యక్షుడు అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన వేంసూరు పోలీసులు

- **రూ.10లక్షల విలువైన 82 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం**
- **నిందితుడి అరెస్ట్**

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: వృద్ధురాలి ఇంట్లో చోరీకి పాల్పడి సుమారు రూ.10లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించిన నిందితుడిని వేంసూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడి నుంచి 82 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు పల్సర్ బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని పల్లెవాడ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు వేంసూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామానికి చెందిన గొల్లపూడి శ్రీహరిను



నిందితుడిగా గుర్తించారు. సాంకేతిక ఆధారాలు, పోలీసుల విచారణ ద్వారా నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. అతడి వద్ద నుంచి మొత్తం 82 గ్రాముల బంగారు ఆభరణాలు, పల్సర్ బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.10లక్షలుగా అంచనా వేశారు. ఏసీపీ



సాంబరాజు, సీఐ సర్వయ్య పర్యవేక్షణలో వేంసూరు ఎస్సై పల్లెల ప్రదీప్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి కేసును ఛేదించింది. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు అధికారులను ఖమ్మం పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రబాబు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రారంభం



ఉద్యమ కెరటం, తాండూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని సోమవారం రాజీవ్ నగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ మామిడాల లలితా రాజేశం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారిని బీమా పరిధిలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలతో హెల్ప్ డెస్క్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కుటుంబ యజమాని అనుకోని పరిస్థితుల్లో మరణించినట్లయితే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా రూ.5లక్షల బీమా సొమ్ము అందుతుందని వివరించారు. ఈ పథకం అర్హులైన కుటుంబాలకు ఎంతో తోడ్పాటును అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రంజిత్, వార్డు సభ్యులు తాటిపాముల రాంప్రసాద్, రాజ్ కుమార్, లింగంపల్లి అఖిల, ఏల్దండి కవిత, రౌతు భారతి, నిరంజన్, కస్తూరి రమేష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

డీఆర్వో నాగరాజమ్మ



ఉద్యమ కెరటం, సిద్దిపేట: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్జిదారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) నాగరాజమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేటలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మొత్తం 199 అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించవద్దని, బాధితులు ఒకే సమస్యపై పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా, తిరిగి అర్జీ పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీలు సుదర్శన్, విజయలక్ష్మిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్.. ప్రజావాణిలో ఫిర్యాదు



ఉద్యమ కెరటం, తాండూర్: తాండూర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో విద్యుత్ సమస్యపై ఓ దరఖాస్తు అందినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని రెచిని గ్రామం మంగలివాడకు చెందిన వొగిలినాదం స్వప్న, గంగాధర్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిపై నుంచి ఎల్‌టీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా వెళ్తోందని దరఖాస్తులో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ కారణంగా ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, కుటుంబ సభ్యుల భద్రత దృష్ట్యా ఆ లైన్‌ను మరో మార్గంలోకి మార్చేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకగా చర్చిలకు రూ.30వేల ఆర్థిక సాయం

మైనారిటీ సంక్షేమ అధికారిణి నాగరాజమ్మ

ఉద్యమ కెరటం, సిద్దిపేట: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని అర్హత కలిగిన చర్చిలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేయనున్నట్లు సిద్దిపేట జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి డి.నాగరాజమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిల వైట్‌వాషింగ్, విద్యుత్ దీపాలంకరణ పనుల కోసం ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సాయం పొందేందుకు అర్హత కలిగిన చర్చిల కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు ఈనెల 30వ తేదీలోగా వెబ్‌సైట్ https://tgobmms.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం సదరు దరఖాస్తు పత్రం హార్డ్ కాపీతో పాటు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలను సిద్దిపేట జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన చర్చిల కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, పాస్టర్లు ప్రభుత్వ అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కెరమెరి మెయిన్ మార్కెట్‌లో పారిశుద్ధ్యం అధ్వానం

నిండిపోయిన మురుగు కాల్వలు



ఉద్యమ కెరటం, కెరమెరి: మండల కేంద్రంలోని మెయిన్ మార్కెట్ ప్రాంతంలో పారిశుద్ధ్య పరిస్థితులు ఆందోళనకరంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందు ఉన్న మురుగు కాల్వల పూడిక తీయకపోవడంతో వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిళ్లు పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోతోందని వాపోతున్నారు. కాల్వల్లో మురుగునీరు నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరిగి స్థానిక ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికుడు కాంబ్లే ధమానంద్ ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ ఉన్న మురుగునీరు, చెత్తాచెదారం కారణంగా విష పురుగులు సంచరిస్తున్నాయని, దోమలతో డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలి..

మెయిన్ మార్కెట్ ప్రాంతంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యపై సంబంధిత పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. మురుగు కాల్వల్లో పూడికను తొలగించి, చెత్తాచెదారాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి రాథోడ్ బాపురావు పరామర్శ



ఉద్యమ కెరటం, నేరడిగొండ: మండలంలోని గుత్వాల గ్రామ మాజీ సర్పంచ్ రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడు రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. రవి మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆప్తుడిని కోల్పోయిన బాధను మాటల్లో చెప్పలేమని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. మృతుడు రవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన వెంట మండల కన్వీనర్ బానోత్ వసంత్ రావు, రాజేశ్వర్, అయ్యూబ్ ఖాన్, రఘునాథ్, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో భారీ చోరీ.. 11 తులాల బంగారం అపహరణ

- 82 తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో గుర్తుతెలియని దుండగులు ఓ ఇంటి తాళాలు పగులగొట్టి భారీ చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చేసుకుని సుమారు 11 తులాల బంగారం, 82 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదును అపహరించారు. మండల కేంద్రానికి చెందిన మారవేణి పరశురాములు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 22న మధ్యాహ్నం ఒంటి గంటకు భార్య, పెద్ద కుమారుడితో కలిసి వేములవాడలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. 23న ఉదయం 6 గంటలకు తిరిగి ఇంటికి చేరుకోగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తాళం కూడా పగులగొట్టి ఉండటంతో అందులో భద్రపర్చిన బంగారు, వెండి ఆభరణాలు, నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించేందుకు విచారణ కొనసాగిస్తున్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



ఉద్యమ కెరటం, డోంగ్లీ: మండలంలోని కుర్ల గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని దబ్బే శోభా, దబ్బే అశోక్ పటేల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డోంగ్లీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజానన్ దేశాయ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదంలో మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు రూ.5లక్షల బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఉదయ్ శ్రీ సుభాష్ పటేల్, గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గట్టుదుద్దెనపల్లి సొసైటీలో రూ.లక్షలు హాంఫట్..?

- పెట్రోల్ బంకులో పైపు లీకేజీ పేర రూ.52లక్షలు స్వాహా
- సీడ్ వ్యాపారం, గన్నీ బ్యాగుల్లో మరో రూ.అరకోటి మాయం
- రూ.38లక్షలే అంటున్న సొసైటీ సిఈఓ తిరుపతి



ఉద్యమ కెరటం, మానకొండూర్: రైతుల నమ్మకంతో నడుస్తున్న సొసైటీలో రూ.అరకోటికి పైగా గోల్‌మాల్ జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి సొసైటీలో అవినీతి వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డీజిల్, పెట్రోల్ బంకులో పనిచేస్తున్న ఉద్యోగి సుమారు రూ.52లక్షలు గోల్‌మాల్ చేసినట్లు తేలిందని రైతులు ఆరోపిస్తున్నారు. షార్టేజీ వచ్చిందని లెక్క చూపడంతో స్కామ్ బయటపడిందని చెబుతున్నారు. సోసైటీలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ సుమారు రూ.4లక్షలు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీడ్ వ్యాపారంలో సిఈఓ సుమారు రూ.40లక్షలు స్వాహా చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. లెక్కలు చూస్తే అవకతవకలు మొత్తం బయటపడనున్నాయి. డీజిల్, పెట్రోల్ బంకు లెక్కలను క్షుణ్ణంగా పరిశీలిస్తే జరిగిన అవకతవకలు బయటపడతాయని చెబుతున్నారు. రోజూ అమ్మకాలు, స్టాక్, కలెక్షన్ లెక్కలు తేడా కొడుతున్నా ఎందుకు పట్టించుకోలేదన్నదే ఇప్పుడు అందరి ప్రశ్న.

పూర్తి విచారణకు డిమాండ్..

స్కామ్ ఒక్క ఉద్యోగి చేసిన పని కాదని, దీని వెనుక ఇతరుల హస్తం ఉండవచ్చని రైతులు అనుమానిస్తున్నారు. కేవలం అంతర్గత విచారణతో సరిపెట్టకుండా సహకార శాఖ ఉన్నతాధికారులు, ఆడిట్ శాఖతో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల డబ్బును కాపాడాల్సిన వారే కాజేస్తుంటే రైతులు ఎవరిని నమ్మాలి.. బంకులో పైపు



లీకేజీ పేరుతో రూ.అరకోటి మాయమైతే ఇక సొసైటీ పరిస్థితి ఏంటి.. అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవినీతిలో నిజాలు బయటకు రావాలంటే రిజిస్టర్లు, అమ్మకాల లెక్కలు, బ్యాంక్ లావాదేవీలు, సీసీటీవీ ఫుటేజీలు అన్నీ బయటపెట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఈఓ వివరణ.. అందులోనే అనుమానం..

సొసైటీలో నిధుల గోల్‌మాల్‌పై చైర్మన్ రాంరెడ్డిని వివరణ కోరగా, విచారణ నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సోసైటీ సీఈఓ తిరుపతిని వివరణ కోరగా ఆయన చెప్పిన సమాధానాలు.. బంకులో ఎలాంటి గోల్‌మాల్ జరగలేదని, పైపు లీకేజీ ద్వారానే సుమారు రూ.38లక్షల రూపాయల పెట్రోల్ వృథాగా పోయిందని సిఈఓ వివరణ ఇచ్చారు. బంకులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిని వేరే సెక్షన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. ఆ ఉద్యోగిని ఎందుకు వేరే సెక్షన్ కు బదిలీ చేశారని అడిగిన ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేశారు. రూ.38లక్షలు షార్టేజి వచ్చినట్లు తేలిందని, ఆడిటర్ మాత్రం సొసైటీలో రూ.62లక్షలు దుర్వినియోగమైనట్లు రిపోర్ట్ ఇచ్చారని సిఈఓ తెలిపారు. విచారణ పూర్తయ్యాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. బంకులో పైపు లీకేజీ అయితే రూ.38లక్షల నివేదిక ఎందుకు వచ్చింది.. గోల్‌మాల్ జరగకపోతే ఉద్యోగిని ఎందుకు బదిలీ చేశారు.. రైతులు చెబుతున్న రూ.52 లక్షలకు, ఆడిటర్ ఇచ్చిన రూ.62లక్షల విచారణ నివేదికకు మధ్య తేడా ఏంటి.. మిగిలిన లక్షల రూపాయలు ఏమయ్యాయి.. అనేది మిస్టరీగా మారింది. చివరగా జిల్లా సహకార అధికారులే తెల్చాల్సి ఉంది.

ఘనంగా శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలు

ఉద్యమ కెరటం, కౌటాల: మండలంలోని మొగడ్ధపూడ్, ముత్యంపేట గ్రామాల్లో శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం ఆలయాల్లో శ్రీ సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని పల్లకిలో అలంకరించి భక్తుల జయజయ ధ్వానాల మధ్య పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన భజన మండళ్ల సభ్యులు భక్తి గీతాలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏర్మ సుమన్ బాయి, ఉప సర్పంచ్ ఫాల్కే రవి, సత్యసాయి సేవా సమితి సభ్యులు శంకర్ రావు, ఎలేకర్ దిలీప్, భగీరథ గర్రెపల్లి, బాబాన్, చూద్రి మణిరాం, పాల్ గోవింద్ రావు, నరులే వానుపటేల్, సుధాకర్, ఏర్మ భాస్కర్, ఊర్వేత బాజీరావు, రామదాసు సుధాకర్, బందు, విలాస్ తదితరులు పాల్గొన్నారు.



పదేళ్ల వైఫల్యాలు చెప్పడానికే జేపీ నడ్డా సిద్ధిపేటకు వస్తున్నారా..?

- బీజేపీ ర్యాలీపై మాజీ ఏఎంసీ చైర్మన్ పాల సాయిరాం విమర్శలు

ఉద్యమ కెరటం, సిద్ధిపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సాధించిన వైఫల్యాలను ప్రజలకు వివరించడానికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఈనెల 25న సిద్ధిపేట పర్యటనకు వస్తున్నారా అని సిద్ధిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం ప్రశ్నించారు. సోమవారం సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్లలో రూపాయి విలువ గణనీయంగా పడిపోయిందని, దేశంపై సుమారు రూ.150 లక్షల కోట్ల అప్పుల భారం పెరిగిందని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతిఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, రాష్ట్రంలోని ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. తెలంగాణను దేశంలో అంతర్భాగంగా కేంద్రంలోని జాతీయ పార్టీలు గుర్తిస్తున్నాయా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని బుల్డోజర్ సంస్కృతిని, నాణ్యత లేని నిర్మాణాలను తెలంగాణకు పరిచయం చేయడానికి వస్తున్నారా అంటూ విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడుతున్న బీజేపీ, సీబీఐ, ఈడీ, ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతూ, సరిహద్దు దేశాల అంశాలను రాజకీయ లబ్ధికి ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఇటీవల సిద్ధిపేటకు రాజకీయ పర్యాటకుల తాకిడి పెరిగిందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ సారయ్య, మండల పార్టీ అధ్యక్షులు లింగం గౌడ్, సంతోష్ రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, తిరుపతి, నరేందర్, యాదగిరి, లాయిక్, అజీజ్, నరేష్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటాం

ఉద్యమ కెరటం, దుబ్బాక: నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన పలు శుభకార్యాలు, ఆత్మీయ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను పలకరించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను నేరుగా కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులుగా అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల వ్యక్తిగత సంతోషాల్లో, కష్టాల్లోనూ భాగస్వాములుగా ఉండటం తమ బాధ్యత అని పేర్కొన్నారు. నాయకులు తమ ఇళ్లకు వచ్చి ఆత్మీయంగా పలకరించడంతో స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల కుటుంబాలకు అండగా హరీశ్ రావు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఉద్యమ కెరటం, సిద్ధిపేట: సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు నంగునూరు మండలంలోని నాలుగు గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్తలు, నాయకుల కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దర్గపల్లిలో పార్టీ కార్యకర్త వెంకన్న తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, అంక్షాపూర్‌లో సీనియర్ కార్యకర్త పిల్లి యాదయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రాంపూర్‌లో మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి మృతి పట్ల విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వెంకటాపూర్‌లో కార్యకర్త సిద్దయ్య తల్లి మృతిచెందడంతో





వారి కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఆపద సమయంలో కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. కార్యకర్తల కుటుంబాలను స్వయంగా కలిసి పరామర్శించడంపై స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

రికార్డుల ట్యాంపరింగ్ పై విచారణ ఏది..?

- పైరవీకారుల చేతిలో రెవెన్యూ వ్యవస్థ
- రైతుల సమస్యలు పట్టని అధికారులు
- డబ్బులిస్తే అక్రమంగా పట్టాలు మార్పిడి
- రైతులను కదిలించిన "ఉద్యమ కెరటం" కథనం



ఉద్యమ కెరటం, మానకొండూర్: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల రెవెన్యూ వ్యవస్థలో అవినీతి రాజ్యమేలుతోంది. రైతులకు అండగా నిలవాల్సిన రెవెన్యూ ఇన్ స్పెక్టర్(ఆర్ఐ) అవినీతికి పాల్పడుతూ అక్రమార్కుల కొమ్ముకాస్తున్న తీరు హాట్ టాపిక్ గా మారింది.
మానకొండూర్ ఆర్ఐ అవినీతి లీలలపై ఇటీవల "ఉద్యమ కెరటం" దిన పత్రికలో వచ్చిన కథనానికి రైతుల నుంచి స్పందన వస్తోంది."ఇది నిజం.. మా భూమి విషయంలో కూడా ఇలాగే జరిగింది" అంటూ పలువురు రైతులు బయటకు వస్తున్నారు.

చెంజర్లలో రికార్డుల ట్యాంపరింగ్..

మానకొండూర్ మండలం చెంజర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో ఓ సర్వే నెంబర్లో అక్రమం జరిగింది. మోఖాపై అసలు భూమే లేని వ్యక్తుల పేర్లపై ఆర్ఐ అక్రమంగా భూమిని నమోదు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఒకరి పేరున 20 గుంటల భూమిని రికార్డుల్లోకి ఎక్కించారు. దీని వెనుక పైరవీకారులతో భారీ బేరసారాలు జరిగాయని, లక్షల రూపాయలు చేతులు మారాయని ప్రచారం సాగుతోంది. అంతటితో ఆగకుండా అదే సర్వే నెంబర్ లో మరికొందరి పేర్లను కూడా అక్రమంగా నమోదు చేసేందుకు ఆర్ఐ ఫైల్ సిద్ధం చేస్తున్నట్లు కూడా తెలుస్తోంది. అసలు పట్టాదారులు భూమి నమోదు కోసం ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతుంటే, డబ్బులున్న వారికి అక్రమంగా భూములు దోచిపెడుతున్నారని రైతులు మండిపడుతున్నారు. భూ భారతి పోర్టల్ లో పేర్లు మార్చడానికి, కొత్త పేర్లు చేర్చడానికి ఆర్ఐ రేట్లు ఫిక్స్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్ఐపై రైతుల ఆరోపణలు..

చెంజర్ల రెవెన్యూ పరిధిలోని ఓ సర్వే నెంబర్లో 20 గుంటల భూమి అక్రమంగా నమోదు చేసిన వ్యవహారం మరువక ముందే గంగిపల్లి గ్రామంలో మరో సర్వే నెంబర్లో ఎలాంటి విచారణ చేయకుండానే తండ్రి పేరున ఉన్న భూమిని ఇద్దరు కూతుర్లపై అక్రమంగా నమోదు చేసి రూ.1.50 లక్షలు తీసుకున్నట్లు మృతుని సోదరుడు ఆరోపిస్తున్నాడు. అంతే కాకుండా చెంజర్లలో ఓ సర్వే నెంబర్లో సుమారు 15 గుంటల భూమిని మృతుని భార్యకు తెలియకుండా ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితురాలు ఆరోపిస్తోంది. ఇదే విషయమై బాధితురాలు ప్రజావాణిలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో కూడా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అంతే కాకుండా గంగిపల్లి గ్రామంలో మరి కొన్ని సర్వే నెంబర్లలో ఎలాంటి ఆధారాలు లేని భూములను భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని భూ భారతి పోర్టల్ లో నమోదు చేసినట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో గంగిపల్లి వీఆర్ఏగా పనిచేసిన వ్యక్తి రైతుల దగ్గర లక్షల రూపాయల డీల్ మాట్లాడుకుని అక్రమంగా భూములను నమోదు చేయిస్తున్నట్లు సమాచారం. అతడు తహశీల్దార్ కార్యాలయం రికార్డుల గదిలో తిష్ట వేసి మాన్యూవల్ రికార్డులను ట్యాంపరింగ్ చేస్తున్నట్లు సిబ్బంది ద్వారా తెలిసింది.

ఆర్ఐ తీరుపై విస్మయం ..

ఆర్ఐ తీరుపై అధికారులే విస్తుపోతున్నారట. పై అధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోకుండా, కింది స్థాయి సిబ్బంది నివేదికలను తోసిపుచ్చి ఇష్టారాజ్యంగా ఫైళ్లను తయారు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కార్యాలయానికి వచ్చే సామాన్య రైతులను గంటల తరబడి వేచి ఉండేలా చేసి, పైరవీకారులు వస్తే మాత్రం చాంబర్ లోకి పిలిచి మరీ పనులు చక్కబెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆర్ఐ ఇప్పటి వరకు అక్రమంగా లక్షల రూపాయలు వెనకేసినట్లు తెలుస్తుంది.

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి..

రెవెన్యూ కార్యాలయంలో ఇంత తతంగం జరుగుతున్నా జిల్లా అధికారులు మౌనంగా ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్ఐ హయాంలో జరిగిన అన్ని భూ మార్పిడులు, భూ భారతి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. చెంజర్ల సర్వే నెంబర్ లో అక్రమంగా నమోదైన 20 గుంటల భూమి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అక్రమ పట్టాను రద్దు చేయాలని, అవినీతికి పాల్పడిన ఆర్ఐని వెంటనే సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చలి తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ ఆంజేల్ ఆల్ఫ్రెడ్



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆంజేల్ ఆల్ఫ్రెడ్ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు చలికాలంలో అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతుండటంతో రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. చలి కారణంగా జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, తుమ్ములు, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తవచ్చని పేర్కొన్నారు. చిన్నారుల్లో ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ల కారణంగా నిమోనియా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చిన్నపిల్లలకు స్వెటర్లు, చెవులకు టోపీలు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు సాక్సులు ధరింపజేయాలని సూచించారు. నెలల వయస్సున్న శిశువులను తల్లి పొత్తిళ్లలో వెచ్చగా ఉంచాలని, ఉదయం వేళల్లో కొద్దిసేపు ఎండలో ఉండేలా చూడాలన్నారు. చిన్నారులతో ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణాలు చేయకుండా జాగ్రత్త పడాలని, నిర్ణీత సమయంలో టీకాలు వేయించాలని తెలిపారు. నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, జలుబు, దగ్గు, జ్వరం లేదా శ్వాస సంబంధిత సమస్యలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వృద్ధురాలికి వీల్ చైర్ అందజేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఉద్యమ కెరటం, సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్ కు చెందిన కొండ లలితవ్వ వృద్ధురాలు సోమవారం ఐడీఓసీకి రాగా, ఆమెతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ తక్షణమే స్పందించి కొండ లలితవ్వకు వీల్ చైర్ అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వృద్ధురాలికి వెంటనే కలెక్టర్ వీల్ చైర్ అందజేశారు. తన సమస్య, ఇబ్బందిని అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో స్పందించి వీల్ చైర్ అందించిన కలెక్టర్కు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: గంభీరావుపేట మండల ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆర్.బాలరాజు సూచించారు. ఇటీవల చోటుచేసుకుంటున్న దొంగతనాల నేపథ్యంలో ప్రజలు ఇంటి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఇంట్లో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలనీలు, పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ అప్రమత్తంగా ఉంటే దొంగతనాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన సర్పంచ్ యూనుస్ పటేల్

ఉద్యమ కెరటం, డొంగ్లీ: మండలంలోని ఎంభూరా గ్రామానికి చెందిన మక్కేవార్ దత్తుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.14,500 ఆర్థిక సహాయ చెక్కును గ్రామ సర్పంచ్ యూనుస్ పటేల్ సోమవారం అందజేశారు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న దత్తు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫహీమ్ పటేల్, పంచాయతీ కార్యదర్శి షోయేబ్, కారోబారి అజ్మెర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



యువ పర్వతారోహకుడు గిట్టె కార్తీక్‌కు సన్మానం



ఉద్యమ కెరటం, కెరమెరి: మండలంలోని కేళి(బి) గ్రామపంచాయతీ పరిధిలోని కేళి(కె) గ్రామానికి చెందిన యువ పర్వతారోహకుడు గిట్టె కార్తీక్‌ను ఆసిఫాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముండే సతీష్ సోమవారం ఘనంగా సన్మానించారు. పర్వతారోహణ రంగంలో కార్తీక్ సాధిస్తున్న విజయాలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముండే సతీష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన కార్తీక్ చిన్న వయస్సులోనే ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ పర్వతారోహణలో ప్రతిభ కనబర్చడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పర్వత శిఖరాలను అధిరోహించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్తీక్ లక్ష్యాల సాధనకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేయడమే తన అంతిమ లక్ష్యమని గిట్టె కార్తీక్ తెలిపారు. తన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన ముండే సతీష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇందిరమ్మ బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా



ఉద్యమ కెరటం, జైనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రషీద్, గౌరీ కొలాంగూడ గ్రామ సర్పంచ్ ఆత్రం అయ్యుబాయి భుజంగ్రావ్ అన్నారు. సోమవారం జైనూర్ మండలంలోని గౌరీ కొలాంగూడ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ రషీద్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కుటుంబంలో అనుకోని ఆపద సంభవించినప్పుడు ఈ పథకం ఆర్థికంగా ఆదుకుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఈ పథకంపై అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మారావు, ఉప సర్పంచ్ షేక్ ఫైసల్, వార్డు సభ్యులు లింబారావు, ముండే వర్ష, గంగారాం, అయ్యుబాయి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భుజంగ్రావు, షేక్ మహబూబ్, అయ్యుబ్, జ్యోతిరం తదితరులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్య పద్ధతులతో భూసారం పెంపు



ఉద్యమ కెరటం, కౌటాల: పంట మార్పిడి, ఎరువుల యాజమాన్య పద్ధతులతో భూసారం పెంపొందించుకోవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారులు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరిరక్షణ, భూ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంట మార్పిడి విధానాన్ని పాటించడం, సమతుల్యంగా ఎరువులు వినియోగించడం, సరైన భూ యాజమాన్య పద్ధతులు అవలంభించడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. భూమి నాణ్యతను కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. మండలంలోని నాగేపల్లి, గుండైపేట, తలోడి, గురుడపేట, ముత్తంపేట, శాండ్గావ్, మొగడగడ్ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు అంజన్న, కల్పన, ఘనశ్యామ్, రేష్మిత, సాగర్, రాజేశ్వర్, కవిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ ఇంచార్జిలకు పూజల హరికృష్ణ సన్మానం



ఉద్యమ కెరటం, సిద్దిపేట: తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నూతన ఏఐసీసీ ఇంచార్జిలను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. గాంధీ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నూతన ఏఐసీసీ ఇంచార్జిగా నియమితులైన కర్ణాటక నేత బిఎం.సందీప్ కుమార్, అలాగే కర్ణాటక రాష్ట్ర నూతన ఏఐసీసీ ఇంచార్జిలుగా నియమితులైన తెలంగాణ నేతలు సయ్యద్ అజ్మాతుల్లా, ఏఐసీసీ కార్యదర్శి సంతోష్ కుమార్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం పూజల హరికృష్ణ మాట్లాడుతూ నూతన బాధ్యతలు చేపట్టిన నేతల అనుభవంతో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంప మహేందర్ రావు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు రషీద్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాహాబ్, టౌన్ మైనారిటీ అధ్యక్షులు అతిఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం: UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

జిలా కలెక్టర్ కుమార్ దీపక్

ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాంతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, మిషన్ భగీరథ పైపులైన్, రేషన్ కార్డులు, పెన్షన్లు, ప్లింత్ ఏరియా సర్టిఫికెట్లు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 63 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్లవాయిలో చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ



ఉద్యమ కెరటం, జైనూర్: మండలంలోని మార్లవాయి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం చేయూత పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను గ్రామ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులు మాట్లాడుతూ గత పదేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు ప్రజాపాలన ప్రభుత్వంలో చేయూత పెన్షన్లు మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు. తమకు ఆర్థిక భరోసా కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పిస్తూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరఫున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్రం రాజేశ్వర్, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరమ్మ నూతన గృహప్రవేశం



ఉద్యమ కెరటం, భీంపూర్: మండల పరిధిలోని గొల్లఘాట్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య భీంపూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామస్తులు, నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం దాసరి రమేష్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేసి, వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదల సొంతింటి కల నెరవేరడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం అతిథులు, నాయకులు, గ్రామస్తులు నూతన ఇందిరమ్మ గృహంలో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దండి సుదర్శన్, అర్లి(టి) సర్పంచ్ కామన్ అశోక్, గొల్లఘాట్ ఉప సర్పంచ్ గణేష్, నాయకులు జలిగిరి మల్లేష్, కాంతారావు, గేడం గంగాధర్ గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తివేసే వరకు పోరాటం ఆగదు

రెండో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



ఉద్యమ కెరటం, జవహర్‌నగర్: డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో చెన్నాపురం చౌరస్తాలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ గడ్డం సదానందం మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, డంపింగ్ యార్డును పూర్తిగా ఎత్తివేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ దీక్షా శిబిరానికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివబాబు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేక లలితా యాదవ్, సీపీఐ నాయకులు కె.జయమ్మ, డి.మల్లిక, సీపీఎం నాయకులు ఆర్.రూప్ కుమార్, బీఎస్పీ నాయకులు ఎస్.కృష్ణ, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వై.మల్లేష్, సీజేసీ శ్రావణ్ కుమార్, టీయూజేఏసీ నాయకురాలు జి.పుష్ప, టీవీవీయూ నాయకురాలు కవిత తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. అలాగే సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి కె.ఎస్. ప్రదీప్, పీహెడబ్ల్యూ నాయకులు డి.స్వరూప, జయసుధ, కాంగ్రెస్ నాయకురాలు అనంతలక్ష్మి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఎం.సురేందర్, మాస్ లైన్ నాయకుడు బండ యాదయ్య, టీయూజేఏసీ నాయకులు ప్రఫుల్ రాంరెడ్డి, కళ్లెపు చంద్రశేఖర ప్రసాద్ తదితరులు శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక క్రాంతి కళాబృందం కవి, గాయకుడు వెంకటచారి ఆలపించిన ఉద్యమ గేయాలు దీక్షా శిబిరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

ఉద్యమ కెరటం, కరీంనగర్: ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి.. సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకునేందుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.. వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో ప్రజావాణి నిర్వహించగా.. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, కరీంనగర్ ఆర్డీవో షర్మిల, తదితర శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 183 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 54, గృహ నిర్మాణ శాఖకు 47 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. తమ లాగిన్ కు వచ్చిన దరఖాస్తులను నెల రోజుల్లోపే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి మరో రూ.5 లక్షల హామీ



ఉద్యమ కెరటం, బజార్ హత్నూర్: బజార్ హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామంలో నిర్వహించిన కనకదుర్గమ్మ జాతర మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. గతంలో ఆలయానికి రహదారి సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ఆడే గజేందర్ రూ.5 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. తాజాగా ఆలయానికి శాశ్వత రహదారి నిర్మాణం కోసం మరో రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. ఆయన హామీపై గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, సర్పంచ్ ప్రియాంక భుమేష్, మండల ఉపాధ్యక్షుడు రాథోడ్ రమేష్, సీనియర్ నాయకులు జాదవ్ గణేష్, మైనారిటీ చైర్మన్ సయ్యద్ సల్మాన్, మండల ప్రధాన కార్యదర్శి గొల్ల నాగు రమేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు చేయూత సంక్షేమ ఫలాలు



ఉద్యమ కెరటం, సిరికొండ: ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్ అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు వెడ్మ భోజ్జు పటేల్ ఆదేశాల మేరకు సోమవారం సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కంచం లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఎమ్మెల్యే భోజ్జు పటేల్ చొరవతో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా చేయూత పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ ఫణిందర్, ఎంపీడీఓ సంతోష్, ఉప సర్పంచ్ బాదు పటేల్, మార్కెట్ డైరెక్టర్ ప్రకాష్, మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్, నాయకులు మెస్రం విజయ్, సాయి, గ్రామస్తులు, పెన్షన్ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ బీమాతో పేద కుటుంబాలకు భరోసా



ఉద్యమ కెరటం, మావల: ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, చేయూత పెన్షన్ల మంజూరుతో పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని మావల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కుదురుపాక సురేష్ కుమార్ అన్నారు. సోమవారం మావల గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ చేయూత పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే బీమా ప్రీమియం భరిస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో మావల సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధర్మపురి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ కొత్తపెల్లి లక్ష్మీ ఆడేళ్లు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు రహీమ్ ఖాన్, ఓబీసీ సెల్ జిల్లా నాయకులు కొత్తపెల్లి అడేళ్లు, మండల ఓబీసీ చైర్మన్ గోస్కూరి రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చొరవ చూపాలి



ఉద్యమ కెరటం, సత్తుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని యాదవ సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె హరిబాబు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8,369 గ్రామ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు ఉన్నాయని, వాటి పాలకవర్గాల పదవీకాలం మరిగిసి సుమారు ఆరేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికలు జరగకపోవడంతో గొర్రెల పెంపకందారులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి గొర్రెల పెంపకందారులకు న్యాయం చేయాలని కోరారు.